# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త




## ఆటలాడుకుంటూ.. మృత్యుఒడిలోకి

**నీటిగుంతలో పడి ముగ్గురు చిన్నారులు దుర్మరణం !!**
**దేవరాజపురంలో సంఘటన.. గ్రామంలో విషాద ఛాయలు !**




మృతి చెందిన చిన్నారులు, ప్రమాదానికి కారణమైన నీటిగుంత

కుప్పం, మే 18 ప్రభాతవార్త

వారంతా పదేళ్లలోపు చిన్నారులు.. వేసవి సెలవులతో పాటు ఆదివారం కావడంతో ఆ చిన్నారులు ఆటలాడుకునేందుకు వచ్చి ఓ నీటి గుంతలో పడి మృత్యువాత పడ్డారు. ఈసంఘటన కుప్పం మండలం దేవరాజపురంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన సుమతి,రాజా దంపతుల కుమార్తె షాలిని (6), వరలక్ష్మి,తిరుపతిల కుమార్తె గౌతమి (7) , యశోద, శరవణన్‌ల కుమారుడు అశ్విన్ (6)లు ఆదివారం తమ ఇళ్ల సమీపంలో ఉన్న చర్చి వద్దకు ఆడుకునేందుకు వచ్చారు. అక్కడే ఆటలాడుకుంటూ చర్చి సమీపంలో ఉన్న నీటి గుంత వద్దకు వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. స్థానికులు గమనించి హుటాహుటిన నీటి గుంతలో పడిన చిన్నారులను పైకి తేగా అప్పటికే వారు మృతి చెందారు. ఈమేరకు పోలీసులకు గ్రామస్తులు సమాచారం అందించారు. కాగా ఒకేరోజు ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడిన సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా చిన్నారుల మృతి పట్ల ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

**బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం**

దేవరాజపురం గ్రామంలో ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడ్డ విషయాన్ని సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ తీసుకెళ్లారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున తలా లక్ష రూపాయలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్‌లను ఆదేశించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు.

**చిన్నారుల మృతి విచారకరం - సిఎం చంద్రబాబు**

కుప్పం మండలం దేవరాజపురం గ్రామంలో ముగ్గురు చిన్నారులు ఆడుకుంటూ నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన విచారకరమని సిఎం చంద్రబాబునాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నారులైన గౌతమి, షాలిని, అశ్విన్‌లు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లల మృతితో తీవ్రశోకంతో ఉన్న పిల్లల తల్లిదండ్రులకు సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాల్ని ఆదుకోవాలని అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

## గంగమ్మ కొండ నిండా భక్త జనం



బోయకొండ(చౌడేపల్లి), మే 18 ప్రభాతవార్త

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో నిండిపోయింది. వేసవి సెలవులు కావడంతో కర్ణాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం అలంకరణ గావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఒక్క రోజు మాత్రమే వివిధ రకాల సేవా టిక్కెట్ల ద్వారా రూ. 15లక్షల మేర ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం ఆలయ అర్చక, అధికార, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## హు'షారు' కొద్ది నిమిషాలే..

**పిఎస్ఎల్‌వి సి 61 రాకెట్ ప్రయోగం విఫలం.. - శ్రీహరికోటలో అంతా మౌనం..**
**ఆరు నిమిషాల్లోనే ఆనందం ఆవిరి.. - ఫెయిల్యూర్‌ను విశ్లేషిస్తున్నాం : శాస్త్రవేత్తలు**



ఆదివారం ఉదయం షార్ నుండి ప్రయోగించిన పిఎస్ఎల్‌వి సి61 రాకెట్





శ్రీహరి కోటలో మీడియాతో మాట్లాడుతున్న ఇస్రో చైర్మన్, షార్ డైరెక్టర్, మిషన్ కంట్రోల్ సెంటర్‌లో రాకెట్ ప్రయోగం వీక్షిస్తున్న శాస్త్రవేత్తలు, ఎంపిల బృందం, రాకెట్ దారి తప్పిన విధానం

శ్రీహరికోట (తడ), మే 18, ప్రభాతవార్త

ఆదివారం ఉదయం 6 గంటలు కావడానికి ఇంకో నిమిషమే ఉంది. అప్పటికి చీకటి పూర్తిగా విడిపోలేదు. భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీ హరి కోటలో చీకటిని చీల్చుకుంటూ పిఎస్ఎల్‌వి సి 61 రాకెట్ ఆకాశం వైపు దూసుకెళ్లింది. దట్టమైన పొగల మధ్య ఈ రాకెట్ నిప్పులు చెరుగుతూ నింగి వైపు వెళ్లడం 6.16 సెకన్ల పాటు కొనసాగింది. అప్పటికే రెండు దశలు విజయవంతంగా పూర్తి చేసుకుని మన దేశీయ రక్షణ ఉపగ్రహం ఈఓఎస్ 09 ఉపగ్రహంతో పాటు రాకెట్ వడివడిగా వెళ్తుంది. ఉన్నట్లుండి ఒక కుదుపు.. ఈ రాకెట్ దారి తప్పినట్లు త్రివేండ్రం నుండి భూ కేంద్రాలలో పనిచేసే శాస్త్రవేత్తలు గుర్తించారు. శ్రీహరికోటతో పాటు మారిషస్ దీవుల నుండి కూడా ఈ రాకెట్‌ను గమనిస్తున్నారు. షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్‌లో ఇస్రో శాస్త్రవేత్తలతో పాటు షార్ పర్యటనకు వచ్చిన ఎంపిల బృందం కూడా రాకెట్ ప్రయోగాన్ని వీక్షించారు. అయితే ప్రయోగం జరిగి రాకెట్ 376 సెకన్ల పాటు విజయవంతంగా నడిచిన రాకెట్ దారితప్పినట్లు కనుక్కొని వీరంతా దిగ్భ్రాంతికి లోనైయ్యారు. శ్రీహరికోట నుండి ఆదివారం ప్రయోగించిన రాకెట్ 101 వది. పిఎస్ఎల్‌వి సిరీస్‌లో 63వది. ఎక్స్ఎల్ తరహాలో రూపొందించిన 27వ రాకెట్ ఇది. ఇప్పటికీ ఎన్నో విజయాలు సొంతం చేసుకున్న ఇస్రో శాస్త్రవేత్తలు ఆదివారం ప్రయోగ వైఫల్యం తరువాత తీవ్ర నిరాశలో మునిగిపోయారు. ఇస్రో చైర్మన్ వి. నారాయణన్‌తో పాటు షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌లు మాత్రమే మీడియా ముందుకు వచ్చి ఈ ఉపగ్రహాన్ని అనుకున్న కక్ష్యలోకి ప్రవేశపెట్టలేకపోయామని, కారణాలను విశ్లేషిస్తున్నామని క్లుప్తంగా చెప్పి వెళ్లిపోయారు. సాధారణంగా రాకెట్ ప్రయోగం విజయం తరువాత వివిధ ఇస్రో కేంద్రాల డైరెక్టర్లు, వెహికల్ డైరెక్టర్, మిషన్ డైరెక్టర్, శాటిలైట్ డైరెక్టర్ తదితరులు మీడియా సమావేశంలో పాల్గొని ఉత్సాహం చూపించేవారు. అయితే ఆదివారం ఇందుకు భిన్నంగా ఇద్దరు మాత్రమే మీడియా ముందుకు వచ్చి వెళ్లిపోవడం విశేషం. శ్రీహరికోటలో ప్రస్తుతం రాకెట్ ప్రయోగ వైఫల్యం గురించి రకరకాలుగా చర్చించుకుంటున్నారు. అయితే దీని వల్ల భవిష్యత్ ప్రయోగాలకు ఎటువంటి అంతరాయం కలగదని పలువురు ధీమాగా ఉన్నారు. త్వరలోనే ఇక్కడి నుండి నిసార్ ఉపగ్రహ ప్రయోగం ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

ఆదివారం శ్రీహరికోట, ఆ కేంద్రం పరిసరాల చుట్టూ పటిష్టమైన బందోబస్తు, తనిఖీలు నిర్వహించారు. సిఐఎస్ఎఫ్ దళాలు, పోలీసులు పహారా కాసారు. ఎంతో మంది ఎన్నో ఆశలతో సక్సెస్ కోసం ఎదురుచూసి, రాకెట్ ప్రయోగం ఫెయిల్ కావడంతో ఉసూరుమని తిరిగి వెళ్లిపోయారు. ఈ ప్రయోగాన్ని చూసేందుకు షార్ లోపలికి అనుమతించకపోవడంతో పులికాట్ దీవులు, సూళ్ళూరుపేట, శ్రీహరికోట మార్గాలలో బారులు తీరి రాకెట్ గమనాన్ని చప్పట్లతో ఆహ్వానించారు. అయితే వారి ఆనందం ఆరు నిమిషాల్లోనే ఆవిరి అయిపోయింది.

### భారీ వర్షంతో నేలమట్టమైన

## తోటలు, వరి పంట

**- లబోదిబోమంటున్న రైతులు**




వెదురుకుప్పం, మే 18 ప్రభాతవార్త :

మండలంలో కురిసిన భారీ వర్షం కారణంగా పంటలు, నేల మట్టం కావడంతో తీవ్రంగా నష్టపోయారు. మండలంలో శనివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో పంటలు, దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని సంతబయలు ఆదిఆంధ్రవాడకు చెందిన మునెమ్మ కుటుంబ సభ్యులు కొంత భూమి కౌలుకు తీసుకుని కూరగాయాలు, వరి సాగు చేశామన్నారు. అకాలంగా కురిసిన భారీ వర్షంకు వరిపంట నీటమునిగిపోగా, కూరగాయాల మొక్కలు నేటమట్టం కావడం జరిగిందన్నారు. పెట్టుబడులు పెట్టిన, ఎరువులు వేసి పంట సాగు చేస్తే చేతికి వచ్చే దశలో భారీ వర్షం వారి ఆశలకు గండికొట్టింది. సుమారు లక్ష రూపాయాలు నష్టంపోయిన్నట్లుచెప్పారు. వర్షం కారణంగా మామిడి పంట, వరి, వేరుశెనగ పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టం అంచనావేసి రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

**పిడుగుపాటుకు దెబ్బతిన్న ఇల్లు**

**ప్రాణాలతో బయటబడ్డ మహిళ - సుమారు రూ.లక్ష నష్టం**



మండలంలో ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షంకు ఓ ఇంటిపై పిడుగుపడిన సంఘటనలో సుమారు లక్ష రూపాయాల ఆస్థినష్టం స్తంభవించగా, ఇంటిలో ఉన్న మహిళ ప్రాణాలతో బయటపడటంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల కథనం మేరకు .... మండలంలోని కాపుమొండివెంగనపల్లె పంచాయితీ బండమీదఇండ్లకు చెందిన శ్యామల గంగాధరం ఇంటిపై పిడుగుపడినట్లు తెలిపారు. పిడుగుపాటుకు ఇల్లు దగ్ధమై అందులో ఉన్న వరి ధాన్యం 50 బస్తాలు, 5 బస్తాలు వేరుశెనగ, 50 కెజీల బియ్యం కాలిబుడిదైయిందన్నారు. దీంతో సుమారు లక్ష రూపాయాల మేరకు నష్టం సంభవించిందన్నారు. శ్యామల ప్రాణభయంతో లబోదిబోమంటూ బయటపడింది. అధికారులు పరిశీలించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## తిరుమలలో ఏర్పాట్లు బావున్నాయి

**-భక్తులకు సౌకర్యాలు మెరుగు అభినందనీయం**

**-కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి**



తిరుమల,మే 18ప్రభాతవార్తప్రతినిధి:

కొంతకాలంగా తిరుమలలో దర్శన ఏర్పాట్లు బావున్నాయని, భక్తులకు సౌకర్యాలు మెరుగు పర చడం అభినందనీయమని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి తెలిపారు. తిరుమలేశుని దర్శనంలో భాగంగా పద్మావతి విశ్రాంతి గృహంలో ఉన్న కేంద్రమంత్రిని ఆదివారం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శ్రీవారితీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.

## పుచ్చ రైతుకు భారీ నష్టం

**- గిట్టుబాటు ధర లేక పొలాల్లోనే వదిలేసిన పుచ్చ పంట...**



చిట్టమూరు, మే 18 ప్రభాతవార్త

పుచ్చ రైతులకు భారీ నష్టం వాటిల్లింది. మంచి దిగుబడులు వచ్చిన మద్దతు ధర లేక పుచ్చ రైతులు భారీ నష్టాలను,కష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి సూళ్లూరుపేట,గూడూరు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో చోటుచేసుకుంది. గత ఏడాది కంటే ఈ దఫా డిసెంబర్, జనవరి మాసాలలో పుచ్చ సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. డిసెంబర్ మాసంలో కురిసిన భారీ వర్షాలకు పుచ్చ రైతుకు తొలి దెబ్బ తగిలి భారీ నష్టాలు మిగల్చగా జనవరి మాసంలో తిరిగి మళ్లీ పుచ్చ సాగును చేపట్టిన రైతులకు ఆశాజనకంగా దిగుబడులు వచ్చినప్పటికీ మద్దతు ధర లేకపోవడంతో భారీ నష్టాలతో కన్నీరు మున్నీరు అవుతున్నారు. సులూరుపేట నియోజకవర్గంలోని సూళ్లూరుపేట, తడ,దొరవారిసత్రం, నాయుడుపేట,పెళ్ళకూరు, ఓజిలి మెట్ట ప్రాంతాలతో పాటు గూడూరు నియోజకవర్గంలోని కోట, వాకాడు,చిట్టమూరు మండలాల్లో సుమారు 500 హెక్టార్లలో పుచ్చ సాగును రైతులు చేపట్టారు. ఎకరా పుచ్చ సాగుకు సుమారు 40 నుంచి 50 వేల రూపాయలు రైతు పెట్టుబడి పెడుతుండగా 20 టన్నులు నుంచి 30 టన్నుల వరకు దిగుబడి వచ్చేది. గత ఏడాది పుచ్చ టన్ను ధర 6000 నుండి 9000 వరకు మార్కెట్లో విక్రయాలు జరిపిన రైతులు ఏడాది టన్ను 3 వేలకు మించి ధరలు లేకపోవడంతో అన్నదాతలు తమ పొలాల్లోని పండిన పంటను వదిలేస్తున్నారు. డిసెంబర్ నెలలో వేసిన పుచ్చ వర్షాలకు దెబ్బతినడంతో ఒకేసారి అన్ని మండలాల రైతులు వేసిన పుచ్చ పంట అందుబాటులోకి రావడంతో ధరల పడిపోయినట్లు కొంతమంది కొనుగోలుదారులు చెబుతున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి పుచ్చ సాగు చేపట్టిన అన్నదాతలకు భారీ నష్టాలు రావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని పుచ్చ రైతులు వేడుకుంటున్నారు.

**ప్రభుత్వ సాయం కోసం అధికారులకు విన్నవిస్తా.....**

ఆయా మండలాల్లో ఆదివారం పుచ్చ పంటను పరిశీలించిన ఉమ్మడి నెల్లూరు జిల్లా భాజపా నేత తిరుపతి పార్లమెంటు సభ్యులు బోలా శీను ప్రభుత్వ సహాయం పై అధికారులకు విన్నవిస్తానని తెలియజేశారు. వాకాడు మండలంలోని కొండాపురం చిట్టమూరు మండలంలోని ఈశ్వర్ వాక,అద్దిపూడి,పెళ్ళకూరు తదితర గ్రామాల్లో ఉచ్చ పంట వేసిన పొలాలను పరిశీలించిన ఆయన రైతుల్లో ధైర్యాన్ని నింపారు. ఎకరాల్లో పుచ్చ పంటను రైతులు వదిలేసారని ప్రధాన కారణం పుచ్చ పంటకు గిట్టుబాటు ధర లేకపోవడమేనని, ప్రభుత్వం పుచ్చరైతులపై దృష్టి పెట్టి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఈ విషయంపై జిల్లా,రాష్ట్ర భాజపా పెద్దలతో పాటు జిల్లా అధికారులకు విన్నవిస్తానని తెలియజేశారు.

## గజవాహనంపై శ్రీమహాలక్ష్మి

**- వర్షం కారణంగా ఊరేగింపు రద్దు, వాహన మండపం వద్ద భక్తులకు దర్శన భాగ్యం**



తిరుచానూరు, మే 18, ప్రభాతవార్త :

తిరుచానూరులో గజవాహనంపై శ్రీమహాలక్ష్మి భక్తులను కటాక్షించారు. అమ్మవారి జన్మ నక్షత్రం ఉత్తరాషాడ సందర్భంగా ఆదివారం సాయంత్రం గజ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. సుప్రభాతంతో అమ్మవారి మేలుకొలుపు సహస్రనామార్చన నిత్య అర్చన నిర్వహించారు. అనంతరం ఆలయం ముఖమండపం వద్ద కల్యాణోత్సవం చేపట్టారు. సాయంత్రం వాహనం వద్ద అమ్మవారిని గజవాహనంపై కొలువు తీర్చారు. వర్షం కారణంగా మాడవీధులలో ఊరేగింపు నిలిపి వేయాలని, మండపం వద్దనే భక్తులు దర్శనానికి ఏర్పాటు చేయాలని ఆలయ డిప్యూటీ ఈఓ హరేంద్రనాథ్ ఆదేశించారు. అనంతరం గ్రామ ప్రజలు భక్తులు పద్మావతి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు బాబు స్వామి, ఏఈఓ దేవరాజులు, ఆలయ ఇన్స్పెక్టర్లు చలపతి, సుభాస్కర్, ఏవీఎస్ఓ సతీష్, అధికారులు పాల్గొన్నారు.

### వైభవంగా కల్యాణ వేంకటేశ్వరుని

## రథోత్సవం




నారాయణవనం, మే 18 ప్రభాతవార్త :

నారాయణవనంలోని పద్మావతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు ఆదివారం ఉదయం 7.30గంటలకు శ్రీవారి రథాన్ని అధిరోహించి నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తుల గోవిందనామా స్మరణతో శ్రీవారి మహారథం ముందుకు సాగి ంది. భక్తులు అడుగడుగునా శ్రీవారి రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. మొక్కుబడి కలిగిన భక్తులు శ్రీవారి రథంపై ఉప్పు, మిరియాలను చల్లి మొక్కును తీర్చుకున్నారు. అలాగే భక్తులు అడుగడుగునా హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. రాత్రి శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరునికి వైభవంగా ఆర్జితం కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రి 9:30 గంటలకు అశ్వవాహనంపై అధిరోహించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. రథోత్సవంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం, డిప్యూటీఇఓ నాగరత్న, ఎఇఓ రవి, సూపరిం టెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్పెక్టర్ భరత్, సివిల్ ఇంజనీర్ గురుప్రసాద్, సిఐ రవీం ద్ర, ఎస్ఐలు రాజశేఖర్, ఓబయ్యా, వేంకటేశ్వర్లు, ఎఎస్ఐలు, సిబ్బంది, టిటిడి విజిలెన్స్, అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్య, శ్రీనివాస భట్టాచార్య, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## కోట్లలో బకాయిలు: వాయిదాలతో కాలయాపన

**పనులు చేసి చేతులు కాల్చుకున్నాం: వడ్డీలు చెల్లించలేక తల్లడిల్లుతున్నాం**
**వైకాపా ప్రభుత్వంలో పనులే లేదు: కూటమి ప్రభుత్వంలో పనులు చేసి ఇబ్బందులు**




తొట్టంబేడు మండలంలో నిర్మించిన సిమెంట్ రోడ్లు, శ్రీకాళహస్తి మండలంలో నిర్మాణం చేపట్టిన గోకులం

శ్రీకాళహస్తి/శ్రీకాళహస్తి రూరల్/తొట్టంబేడు,మే 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నాలుగు మండలాలు సుమారు 144 పంచాయతీలున్నాయి. ఏర్పేడు,శ్రీకాళహస్తిరూరల్,తొట్టంబేడు మండలాల్లోనూ, శ్రీకాళహస్తి మున్సిపాలిటి పరిధిలో మినీ గోకులాలు,సిమెంటు రోడ్లు వేసిన వారికి చెల్లింపులు చేయక అధికారులు తిప్పుకుంటున్నారు. మొహం చాటేస్తున్నారు. పనులు మంజూరు చేసిన నాటి నుంచి పనులు తీసుకున్న వారిని పరుగులు తీయించి అమలు చేసారు. తీరా చెల్లింపులు చేయాల్సిన సమయంలో అధికారులు మొహం చాటేస్తున్నారు. పనులు చేసిన వారు తెచ్చుకున్న అప్పుల వాళ్ళకు మొహం చూపలేక ఎందుకు పనులు చేసామా? అని కుములు తున్నారు. గతంలో కూడా తెలుగుదేశం హయాంలో 'నీరు-చెట్టు' పనులు చేసిన వారు (నామినేట్ పద్ధతిపై) చేతులు కాల్చుకున్నారు. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి చోటు చేసుకుంది.

**మండలాల్లో బకాయిలు:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు,శ్రీకాళహస్తి రూరల్,తొట్టంబేడు మండలాల్లో జరిగిన పనులు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను పరిశీలిస్తే ఏర్పేడు మండలంలో మినీ గోకులాలు 18 నిర్మించారు. ఇందుకుగాను రూ.23లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.1.98లక్షలు మంజూరు అయినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా 90 సిసి రోడ్లు నిర్మించగా బిల్లులు రూ.1.64కోట్లుగా నమోదు చేసారు.కానీ ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు రూ.18.71లక్షల మాత్రమే. ఇక శ్రీకాళహస్తి రూరల్‌లో పరిస్థితి పరిశీలిస్తే 93 సిమెంటు రోడ్లను సుమారు 7కిలో మీటర్ల మేరకు నిర్మించారు.ఇందుకు రూ.3కోట్లు బిల్లులు నమోదు చేసారు.మినీ గోకులాలు 136 పనులు పూర్తి చేయగా రూ.2.3కోట్లు చెల్లించాల్సి ఉంది.తొట్టంబేడు మండలంలో 36 మినీ గోకులాలు నిర్మించగా రూ.1.2కోట్లు బిల్లులు నమోదు చేసారు. అయితే మంజూరు అయిన నిధులు కేవలం రూ.2.3లక్షలు 33 సిమెంటు రోడ్లు ఒక తారు రోడ్డు నిర్మించగా బిల్లులు రూ.1.5కోట్లకు నమోదు చేయగా రూ.1,7లక్షలు మంజూరు అయినట్లు సమాచారం. ఇక మున్సిపాలిటిలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లు ఎందుకు పనులు చేసామా? అని మధన పడుతున్నారు.పనులు చేసిన వారు రోజూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటే సమాధానం చెప్పలేక అధికారులు మొహం చాటుతున్నారు.

# బియ్యం లోడ్డుతో వెళ్తున్న లారీ బోల్తా

కుప్పం, మే 18ప్రభాతవార్త



కుప్పం - తిరుపత్తూరు మార్గంలో మండలంలోని శెట్టిగానికుంట వద్ద బియ్యం లోడ్డుతో తమిళనాడు వెళ్తున్న ఓ లారీ బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. రోడ్డు పక్కనే లారీ అదుపు తప్పి పడిపోయింది. విషయాన్ని స్థానికులు తహశీల్దార్, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ విషయంగా తహశీల్దార్ చిట్టిబాబును 'ప్రభాతవార్త' వివరణ కోరగా బంగారుపేట నుంచి తమిళనాడుకు తరలిస్తున్న బియ్యం రేషన్ బియ్యమా కాదా అనే విషయంగా విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం అని నిర్ధారణ అయితే కేసు నమోదు చేస్తామన్నారు.

# పుంగనూరుపై డిప్యూటీ సీఎం దృష్టి

వేణుగోపాల్‌తో మంత్రి నాదెండ్ల



**పుంగనూరు, మే 18, ప్రభాతవార్త** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన నేత పవన్‌కళ్యాణ్ పుంగనూరుపై ప్రత్యేకమైన శ్రద్ధతో ఉన్నారని మంత్రి, పిఎస్‌సి చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నట్లు జనసేన నాయకుడు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. తెనాలి పర్యటనలో ఉన్న ఆయనను వేణుగోపాల్ రెడ్డి ఆదివారం ఉదయం కలిశారు. పుంగనూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఆయన మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుంగనూరుపై ప్రత్యేక దృష్టి కలిగి ఉన్నారని, పుంగనూరులో సమస్యల పరిష్కారానికి తాము అండగా ఉంటామని ప్రజలకు భరోసా కల్పించేందుకు మరింత శ్రద్ధ తీసుకోవాలని ఆయన వేణుగోపాల్ రెడ్డికి వివరించారు. త్వరలో పుంగనూరు నియోజకవర్గంలో పర్యటనకు తను వచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శివ కుమార్ రెడ్డి, చిత్తూరు జిల్లా ప్రోగ్రామ్స్ కమిటీ సభ్యులు చైతన్య రాయల్, నరేంద్ర రెడ్డి,నారాయణ రెడ్డి, రూరల్ అధ్యక్షుడు విరూపాక్షి,పట్టణ అధ్యక్షుడు నరేష్ రాయల్, సోమల మండల అధ్యక్షుడు నాగ భూషణ్, హరి నారాయణ, రఘు, పాముల హరి, చిన్నా, జావెద్, మండల ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

# మహానాడు విజయవంతానికి కమిటీ చర్యలు

- ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, మే 18 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ ఈనెల చివరి వారంలో నిర్వహించే మహానాడు కార్య క్రమం విజయవంతానికి సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఏర్పాటైన మహానాడు కమిటీ తగు చర్యలు చేపడుతోందని ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం ఆయన కడపజిల్లా చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురం గ్రామంలో జరిగిన మహానాడు కమిటీ సమావేశంకు హాజరయ్యారు. సమావేశంకు మంత్రులు మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, సవితమ్మ హాజరయ్యారన్నారు. వీరితో పాటు కమిటీ సభ్యులు మహానాడు నిర్వహణ ఏర్పాట్లు, వసతులు, కార్యకర్తలకు సౌకర్యాలు తదితర అ ంశాలపై చర్చించినట్లు తెలిపారు.

# 21న డిఇఓ కార్యాలయం ముట్టడి

*చిత్తూరురూరల్, మే 18 ప్రభాతవార్త:*




టీచర్ల బదిలీలకు సంబంధించి చేసిన చట్టంలోని అసంబద్ధతలు, పాఠశాల పునర్వ్యవస్థకు సంబంధించి నిబంధనలను సవరించాలనే డిమాండ్‌తో ఈ నెల 21వ తేదీ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన పిలుపు మేరకు డిఇఓ కార్యాలయ ముట్టడికి ఉపాధ్యాయులు సిద్ధం అయ్యారు. చిత్తూరు ఎన్జీఓ హోమ్‌లు ఆదివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్.బాలాజీ, ఎఎం గిరిప్రసాద్‌రెడ్డి, జివి రమణల ఉమ్మడి అధ్యక్షతన సమావేశమైన ఉపాధ్యాయ ఐక్య వేదిక స్టీరింగ్ కమిటీ తీర్మానం చేసింది. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ 117 జిఓను రద్దు చేయమని రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం 117 జిఓ రద్దు పేరుతో గతంలో ఆరుగా వున్న పాఠశాలలను తొమ్మిది రకాలుగా విభజించిందని, ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. పాఠశాల స్థాయిలో వున్న భౌతిక, సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా పాఠశాలలను పునర్వ్యవస్థీకరించడం జరిగిందని, దీని ద్వారా పెద్ద ఎత్తున ఉపాధ్యాయ పోస్టులు మిగులుగా వచ్చాయని వారు పేర్కొన్నారు. అలాగే మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడల్ స్కూల్ పేరుతో తరలించడం వల్ల అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోవడంతో పాటు చిన్న పిల్లలు కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఇతర ప్రాంతాలకు చేరుకోవడం కష్టమవుతుందన్నారు. అలాగే బదిలీల నిబంధనలకు సంబంధించి ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ప్రతిపాదనలను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అలాగే ప్రిఫరెన్షియల్ కేటగిరి కింద బదిలీ కోరుకునే టీచర్లకు ఇచ్చిన నిబంధనలను సవరించాలని కోరుతూ ఈ నెల 21వ తేదీన జరిగే డిఇఓ కార్యాలయ ముట్టడి కార్యక్రమంను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎస్.బాలాజీ, ఎం.గిరిప్రసాద్‌రెడ్డి, జివి.రమణ, చెంగల్రాయమందడి, మదన్‌మోహన్‌రెడ్డి, రహ్మద్, మునాఫ్, మత్యాలరెడ్డి, మణిగండన్, మునీర్ అహ్మద్, కెఎస్ కన్నన్, దొడ్డ ఉమామహేశ్వర్, కిరణ్‌కుమార్, చిట్టిబాబు, గోవిందస్వామి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మంజు నాధగుప్తా, నాగరాజరెడ్డి, రెడ్డప్పనాయుడు,దండురామచంద్రయ్య,ఎస్పీ భాషా, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# శ్రీవారి సేవలో చిత్తూరు జిల్లా ఎస్పీ



తిరుమల,మే 18ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠచందోలు దంపతులు దర్శించుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ద్విచక్రవాహనం బోల్తా: ఇద్దరికి తీవ్రగాయాలు



*వేదురుకుప్పం, మే 18 ప్రభాతవార్త :* ద్విచక్రవాహనం వేగం అదుపుతప్పి బోల్తాపడి ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు ... మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు సమీపంలో దేవళంపేట రహదారిలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో తీవ్ర గాయాలైన్నాయి. గాయపడ్డవారు గంగాధర నెల్లూరు మండలం నేల్లెపల్లె సమీపంలోని కొత్తూరు చెందిన వారుగా గుర్తించారు. వారు సొంత పనుల నిమిత్తం పచ్చికాపల్లం నుంచి కొత్తూరుకు వెళ్ళుతుండగా ప్రమాదం సంభవించిన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక చికిత్స నిమిత్తం గాయపడ్డవారిని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు.

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

- కడ పి.డి. వికాస్ మర్మత్

**కుప్పం, మే 18 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గ స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కార్యక్రమంను ఈనెల 19వతేది సోమవారం రద్దు చేసినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. శ్రీ తిరుపతి గంగమ్మ జాతరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్న నేపథ్యంలో ఏర్పాట్ల పర్యవేక్షణ నిమిత్తం కార్యక్రమాన్ని ఈ వారం రద్దు చేశామన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

# శాంతిపురంలో తిరంగా ర్యాలీ



**శాంతిపురం, మే 18 ప్రభాతవార్త** ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం పట్ల ప్రభుత్వం సూచనల మేరకు శాంతిపురంలో బిజెపి, జనసేన నేతలు తిరంగార్యాలీనిర్వహించారు.శాంతిపురంనుంచి బడుగుమాకులపల్లిదాకాఈర్యాలీ కొనసాగింది. భారత్ మాతా కీ జైఅంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షుడు గజేంద్ర, ఉపాధ్యక్షుడు కుమార్, జనసేన మండలాధ్యక్షుడు కిషోర్, ఇరు పార్టీల నేతలు రమేష్, సుబ్రమణ్యం, సుధాకర్, వీరరాఘవులరెడ్డి, నవీన్‌కుమార్, వేణు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూలిన ప్రహరీగోడ.. బస్సుకు తప్పిన ప్రమాదం



వి.కోట, మే 18 ప్రభాతవార్త

వి.కోట పట్టణంలోని బస్టాండు ఆవరణలో 27 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రహరీగోడ ఆదివారం కొంతమేర కూలింది. అదే సమయంలో ఆర్టీసీ బస్సు రావడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సుకు, ప్రయాణీకులకు ప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ అధికారులు బస్టాండును పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రయాణీకులు పేర్కొంటున్నారు. వి.కోట బస్టాండులో కనీస వసతులు కల్పించడం లేదని పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కొత్త ప్రహరీగోడ నిర్మించడంతో పాటు ప్రయాణీకులకు అవసరమైన వసతులు కల్పించాల్సి ఉంది.

# భక్తుల కోసం మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు



కుప్పంరూరల్, మే 18 ప్రభాతవార్త

కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ జాతర జరుగుతున్న విషయం విదితమే. జాతరకు వచ్చే లక్షలాది భక్తుల సౌకర్యార్థం మలమూత్ర విసర్జనకు గాను కుప్పం మున్సిపాలిటీ తరపున ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. చెన్నై నుంచి మొబైల్ టాయిలెట్లను తెప్పించి పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాటిని ఏర్పాటుచేశారు. దీనిపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అమ్మరాజుపల్లి సర్పంచ్‌తో సహా పలువురు టిడిపిలో చేరిక

పెద్దపంజాణి, మే 18 ప్రభాతవార్త:



మండలంలోని అమ్మరాజుపల్లి పంచాయతీ సర్పంచ్ స్వర్ణమ్మతో సహా ఆమెకుటుంబీకులు, వార్డుసభ్యులు పలువురు గ్రామస్థులు దాదాపు 50మంది ఆదివారం అధికార తెలుగుదేశంలో చేరారు.పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సమక్షంలో వీరుపార్టీలో చేరారు. ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి వీరికి పార్టీకండువాలుకప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్,చలపతి, మురహరి రెడ్డి,సుధాకర్ రెడ్డి,రోజారెడ్డి,శ్రీరాములు,నాగరాజురెడ్డి ,రెడ్డెప్ప రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

# వైష్ణవీదేవీ పాహిమాం...!



***పుదిపట్ల(చౌడేపల్లి), మే 18 ప్రభాతవార్త*** మండలంలోని పంచాయతీ కేంద్రం స్వయంభు వైష్ణవీదేవి ఆలయంలో సాంప్రదాయ బద్ధంగా పూజలు జరిగాయి. ఉదయాన్నే మహిళా అర్చకురాలు శ్రావణిచే అమ్మ వారికి విశేషాభిషేకం అలంకరణ గావించారు. ఆలయం ప్రాంగణంలోని నాగభైరవుడు,ఆంజనేయస్వామి వార్లను భక్తులు దర్శించుకొన్నారు. భక్తులకుఆలయనిర్మాణకర్తవినోద్‌కుమార్‌రెడ్డిపవిత్రతీర్థప్రసాదాలందించారు.

# అపోలోలో డైరక్ట్ యాంటీరియర్ అప్రోచ్ పద్ధతిలో తుంటి శస్త్రచికిత్సలు




***తవణంపల్లె, మే 18 ప్రభాతవార్త:*** చెన్నై అపోలో ఆస్పత్రిలో అధునాతనమైన డైరక్ట్ యాంటీరియర్ అ ప్రోచ్ పద్ధతిలో హిప్ (తుంటి) రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఆర్థో వైద్యనిపుణులు డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, ఆస్పత్రి ఏఓ చంద్రవేఖర్‌రెడ్డిలు తెలిపారు. శనివారం అరగొండ అపోలో ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అపోలో చైర్మన్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి ఆదేశాల మేరకు చెన్నై అపోలో ఆస్పత్రిలో మొదటిసారిగా డైరక్ట్ యాంటీరియర్ అ ప్రోచ్ పద్ధతిలో తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో ఇప్పటి వరకు ఏడు ఆపరేషన్‌లను నిర్వహించామన్నారు. రోగికి తక్కువ నొప్పి వుంటుందని, హిప్ ఫ్రాక్చర్‌లను రక్షించడంతో జాయింట్లలో స్థిరత్వం వుంటుందని, రోగులు మునుపటి కంటే త్వరగా సహజమైన కదలికలను తిరిగి పొందుతారని మదన్‌మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలు తెలిపారు. ఈ ఆపరేషన్‌లకు ఎంప్లాయ్ ఇన్సూరెన్స్ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో డైరక్ట్ యాంటీరియర్ అ ప్రోచ్ వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కార్తీక్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, ఆస్పత్రి పీఆర్ఓ కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

# భారత సైనికులకు సంఘీభావం తెలుపుతూ తిరంగా ర్యాలీ




***సోమల, మే 18, ప్రభాతవార్త*** పాకిస్తాన్‌పై భారత సైనికులు ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా నిర్వహించడంపై సోమల మండల ప్రజలు ఉత్సాహంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ బిజెపి కన్వీనర్ గన్న మదన్మోహన్ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతం నుంచి గవర్నమెంట్ హాస్పిటల్ నుంచి బస్టాండు గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. జై జవాన్, వందేమాతరం నినాదాలతో పురవీధులు మారు మ్రోగాయి. ఈ సందర్భంగా యుద్ధంలో అమరులైన వీరులకు ఘనంగా నివాళి అర్పించారు. విపత్కర పరిస్థితుల్లో దేశం మొత్తం ఒక్కటిగా నిలుస్తుందని ప్రజలు ప్రతిజ్ఞ పూనారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు హేమగిరి, నరేంద్ర, సదాశివయ్య, వరదం వెంకటరమణ, జ్యోతీశ్వరుడు, రామకృష్ణ, విజయ్, వైస్ ఎంపీపీ ప్రభాకర్, మాజీ సర్పంచ్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# పి. కొత్తకోట సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో అడ్మిషన్స్ ప్రారంభం



***పూతలపట్టు, మే 18 ప్రభాతవార్త*** పి కొత్తకోట సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం నందు మూడవ తరగతి నుండి పదవ తరగతి వరకు అడ్మిషన్స్ ప్రారంభమవునని వసతిగృహ సంక్షేమాధికారి తెలియపరిచారు. ఈ విద్యా సంవత్సరానికి పదవ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వసతి గృహంలో చదివే పిల్లలకు ఉదయం మరియు సాయంత్రం ప్రత్యేకంగా ట్యూటర్స్‌ని నియమించి విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ నిర్వహించి ఉత్తమ ఫలితాలు తీసుకురావడమే తమ వసతి గృహ లక్ష్యమని తెలిపారు. పదితరగతి విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ చూపించి ఉత్తమ ఫలితాలకు కృషిచేస్తున్నామన్నారు. కావలసిన పత్రాలు విద్యార్థి తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు తల్లిదండ్రుల రేషన్ కార్డు కాపీ విద్యార్థి తల్లి లేదా తండ్రి యొక్క బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ విద్యార్థి పాస్పోర్ట్ సైజ్ ఫోటో 2 సంప్రదించవలసిన వారు వసతిగృహ సంక్షేమ అధికారి శ్రీకాంత్ రెడ్డి 9440794236 వసతి గృహ సిబ్బంది ఎస్. జ్ఞాన శేఖర్ 7660999329 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# డాక్టర్ అవతారమెత్తుతున్న నర్సులు

పూతలపట్టు, మే 18, ప్రభాతవార్త



వైద్యో నారాయణో అన్నారు. వైద్యుడు భగవంతుడుతో సమానమని, కానీ దీనికి భిన్నంగా పి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రిలో నిద్రమత్తులో డాక్టర్లు ఉండడంతో రోగి ఆసుపత్రికి వస్తే నర్సులే ఆ రోగికి వైద్యం చేయించి వారికి కావలసిన మందులు వారే ఇచ్చి రోగులను పంపిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. రోగులు డాక్టర్ లేరని అడిగితే డాక్టరు ముఖ్యమైన పని మీద ఉన్నారని చెప్తున్నారు. తీరా ఆ డాక్టరు మంచి నిద్రమత్తులో ప్రభుత్వ ఆసుపత్రిలో సేద తీర్చుకోవడం రోగులను విస్మయానికి గురిచేసింది. ఇకనైనా జిల్లా ప్రభుత్వ అధికారులు గ్రామాలు పల్లెటూరు నుంచి వచ్చే రోగులను పట్టించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో వారికి మెరుగైన వైద్యం మందేలా చూడవలసిన బాధ్యత తమపై ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు



పుంగనూరు రూరల్, మే 18 ప్రభాతవార్త

పట్టణానికి చెందిన తెలుగుతల్లి వృద్ధాశ్రమానికి ఎస్ఐ లోకేష్, జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావులు నిత్యవసర సరుకులు విరాళంగా అందజేశారు. తెలుగు తల్లి వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందిన వారికి భరోసా కల్పించేందుకు రూ. 12 వేల విలువచేసే నిత్యవసర సరుకులను ఎస్సై లోకేష్ వృద్ధులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు ప్రేమ, మర్యాద, ప్రశాంతతను తప్ప ఏమి ఆశించారన్నారు. వారికి మనోధైర్యాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు నటరాజ్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# బోయకొండను ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

రాష్ట్ర బీజేపీ నాయకులు అయూబ్ ఖాన్

**పుంగనూరు, మే 18, ప్రభాతవార్త** గొప్ప సాంస్కృతిక వారసత్వ సంపదైన బోయ కొండా ఆలయాన్ని




జాతీయ వారసత్వ సర్క్యూట్‌లో చేర్చాలని రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చా నాయకుడు అయూబ్ ఖాన్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ అంతర్జాతీయ పర్యాటకుల ఆకర్షణే ధ్యేయంగా బోయ కొండ ఆలయాన్ని ఇన్ క్రెడిబుల్ ఇండియా, దేఖో అప్నా దేశ్ విభాగాల్లో మంచి ప్రాచుర్యం కల్పించాలని పేర్కొన్నారు. గొప్ప సాంస్కృతిక, చారిత్రాత్మక ప్రాముఖ్యత కలిగిన బోయకొండ అభివృద్ధికి సహకరించాలని, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యకలాపాలకు పుంగనూరు నియోజకవర్గానికే తలమానికంగా నిలిచే బోయ కొండ ఆలయ ప్రాశస్త్యాన్ని, దాని అభివృద్ధి ఆవశ్యకతను షెకావత్ కి తాను వివరించానన్నారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా బోయ కొండ ఆలయాన్ని తొలుత ఇన్ క్రెడిబుల్ ఇండియా, దేఖో అప్నా దేశ్ విభాగాల కింద విస్తృత ప్రాచుర్యం కల్పించాలని ఆయన కోరారు. బోయ కొండ యొక్క సమగ్రత, విశిష్టతను కాపాడటానికి కేంద్ర పురావస్తు విభాగం, సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో అక్కడ ఉన్న సహజ సిద్ధమైన చారిత్రత కట్టడాల పునరుద్ధరణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యాటకుల్ని ఆకర్షించడానికి లైట్, సౌండ్ షోలు, గైడెడ్ హెరిటేజ్ వాక్ లు, వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై తక్షణమే కేంద్రపర్యాటక శాఖ దృష్టి పెట్టాలని అభ్యర్థించారు.

# వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్లకు పోలీసులు వార్నింగ్

చిత్తూరు రూరల్, మే 18 ప్రభాతవార్త:



చిత్తూరు నగర పరిధిలో ద్విచక్ర వాహనాలు నడుపుతూ ఆదివారం పట్టుబడిన మైనర్లకు పోలీసులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, చిత్తూరు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, తాలుకా స్టేషన్ ఎస్ఐ మల్లికార్జున్‌ల ఆధ్వర్యంలో చిత్తూరు నగర పరిధిలో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో సుమారు వంద మంది మైనర్లు ద్విచక్రవాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరందరికీ చిత్తూరు డిఎస్పీ సాయినాథ్ చిత్తూరు టుటౌన్ స్టేషన్‌లో పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇకపై నగర పరిధిలో ఎవరైనా మైనర్లు వాహనాలు నడిపితే పోలీసులకు పట్టుబడిన వారికి రూ.5 వేల జరిమానాతో పాటు వారి తల్లిదండ్రుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని డిఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మల్లికార్జున, సుగుణ, ఎఎస్ఐ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

# నేడు పోలీస్ స్పందన

**చిత్తూరురూరల్, మే 18 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రజలు ఎదైనా సమస్య వుంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# గుండ్లపల్లె ఎస్టీ కాలనీలో 2.2 కిలోల గంజాయి స్వాధీనం

ఐరాల, మే 18 ప్రభాతవార్త:




మండలంలోని గుండ్లపల్లె ఎస్టీ కాలనీలో గంజాయి విక్రయిస్తున్న మహిళలను స్థానిక పోలీసులు ఆదివారం ఆరెస్ట్ చేసి ఆమె వద్ద నుండి 2.2 కిలోల గంజాయిని సా ్వధీనం చేసుకున్నారు. వివరాలిలావున్నాయి. ముందుగా అందిన సమాచారం మేరకు ఐరాల తహశీల్దార్ మహేష్‌కుమార్, కల్లూరు సీఐ సూర్యనారాయణ, ఐరాల ఎస్సై నరసింహులులు తమ సిబ్బందితో గుండ్లపల్లె ఎస్టీ కాలనీలో ఆదివారం ఉదయం దాడి చేసి వరప్రసాద్ భార్య సునీత (45) అనే మహిళలను అరెస్ట్ చేసి ఆమె వద్ద 2.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని సునీతను రిమాండు నిమిత్తం చిత్తూరు కోర్టుకు తరలించినట్లు స్థానిక ఎస్సై నరసింహులు తెలిపారు.

# నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు రూరల్, మే 18 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు తప్పక హాజరు కావాలని ఆయన ఆదేశించారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరై ప్రజల నుండి అందిన సమస్యలను స్వీకరించి వాటిని సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

# కాణిపాకంలో భక్తుల కిటకిట

-దర్శనానికి నాలుగు గంటల సమయం

కాణిపాకం, మే 18 ప్రభాతవార్త:



సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు,వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో పాటు విద్యాసంస్థలు,పాఠశాలలకు సెలవులు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. శని, ఆదివారాల్లో ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు

## అట్టహాసంగా తిరంగా ర్యాలీ

### పాల్గొన్న వందలాది కూటమి నేతలు, కార్యకర్తలు

నారాయణవనం, మే 18 ప్రభాతవార్త :



నాగలాపురం మండల కేంద్రంలో కూటమి నేతల ఆధ్వర్యంలో సైనికులకు మద్దతుగా నిర్వహించిన తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొ న్నారు. అనంతరం ఆయన నాగలాపురంలోని చల్లాతమ్మ అమ్మవారి దర్శనం చేసుకున్నారు. యుద్ధంలో మృతి చెందిన వీర జవాన్ల చిత్ర పటాలకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు ఆయన నాగలాపురంలోని చల్లాతమ్మ అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

## విద్యార్థిస్థాయి నుంచే కరాటేలో శిక్షణ పొందాలి

### -విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ రాజాశికామణి

తొట్టంబేడు, మే 18 ప్రభాతవార్త



మహిళలపై జరిగే అఘాయిత్యాలను నిర్మూలించడానికి విద్యార్థి స్థాయి నుంచే కరాటే నేర్చుకోవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ రాజాశికామణి తెలిపారు. న్యూమాంక్స్ కుంపు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని అమరావతి జూనియర్ కళాశాలలో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ముఖ్యఅతిధిగా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఎం.రవికుమార్, ఆలిండియా అధ్యక్షులు, విశ్రాంత ఎస్పీ డాక్టర్ రాజశిఖామణి, తిరుపతి విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాస్, టుటౌన్ సిఐ నాగార్జునరెడ్డి, ఎంఈవో 2 బాలయ్య, సౌత్ ఇండియా చీఫ్ ఇన్స్పెక్టర్ రాఘవులు మరియు సంస్థ శ్రీకాళహస్తి అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు గరికపాటి రమేష్, కార్యదర్శి రాజేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాబాఫరీద్, గౌరవాధ్యక్షులు జమ్రుద్దీన్‌బాష, మరియు సయ్యద్ అహ్మద్‌లు హజరయ్యారు. తొలుత కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు అమరవీరుడు మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మురళీ ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం వహించారు. తిరుపతి విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. తల్లిదండ్రులు ప్రతి ఒక్కరు తమ బిడ్డలకు విద్యార్థి దశలోనే నేర్పించాలని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులకు కుంపు, కరాటేలో ఆత్మస్థైర్యం నింపడమే కాకుండా శారీరక మానసిక ఉత్సాహం ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా క్రీడలు, కరాటేపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అతిధులు పాల్గొన్నారు.

## కష్టపడి పని చేసే వారికి పార్టీలో గుర్తింపు

విజయపురం, మే 18 ప్రభాతవార్త:



కష్టపడి పని చేసే వారికి పార్టీలో గుర్తింపు ఎప్పటికీ ఉంటుందని టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు పేర్కొన్నారు. ఆదివారం విజయపురంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా మండల పరిధిలో అన్ని విభాగాలకు కమిటీ సభ్యులను నియమించాల్సి ఉందని అందుకు అవసరమైన చర్చలు జరుగుతున్నాయన్నారు. ఇందులో పార్టీకి విధేయతగా ఉన్నటువంటి వ్యక్తులకు పదవులు లభిస్తాయని అన్నారు. పదవులు వచ్చిన రాకపోయినా పార్టీ పటిష్టతకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒకటి, రెండు రోజుల్లో మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటవుతుందన్నారు. కార్యక్రమంలో వారితో పాటు ప్రధాన కారనయదర్శి బాబుయాదవ్, పంచాయతీ రాజ్ ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు సుక్క ధనంజయయాదవ్, పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, నాయకులు వేణుగోపాల్‌నాయుడు, దశరతరాజు, శివలింగం, గుణ భూషణమ్మ, ముని భాస్కర్‌రాజు, నాగభూషణం యాదవ్, సుధానాయుడు, బాలయ్యానాయుడు, ఆర్ముగంరెడ్డి, రఘుపతిరాజు, పలువురు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయపురంలో వైభవంగా కనకదుర్గమ్మ తిరుణాళ్లు

విజయపురం, మే 18 ప్రభాతవార్త:



మండలకేంద్రమైన విజయపురంలో ఆదివారం కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆ గ్రామస్తులు విశేష పూజలు నిర్వహించి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, మాజీ మంత్రి రోజా, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశా లల చైర్మన్ కొండూరు అశోక్ రాజు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

## ఉచితంగా కళ్ళ అద్దాలు పంపిణీ

విజయపురం, మే 18 ప్రభాతవార్త:



మండలంలోని పాతార్కాడు గ్రామంలో ఆదివారం పలువురికి ఉచితంగా కళ్ళ అద్దాలను పంపిణీ చేశారు. అడాప్టెడ్ విలేజ్ ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ పందేటి భూపతి రాజు ఆర్థిక సౌజన్యంతో ఇటీవల తిరుపతికి చెందిన వాసన్ ఐ కేర్ ఆస్పత్రి ద్వారా జంబాడ, కోసలనగరం, పాతార్కాడు, నెహ్రూ నగర్ గ్రామాలకు చెందిన ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన కంటి అద్దాలను ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు లక్ష్మీపతిరాజు, రవిరాజు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వీక్షకులను అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, మే 18, ప్రభాతవార్త :



తిరుచానూరు రోడ్లోని శిల్పారంలో కళాకారుల నృత్య ప్రదర్శన వీక్షకులను అలరించింది. శిల్పారామం ఏవో సుధాకర్ సమాచారం ప్రకారం.. ప్రతి ఆదివారం కార్యక్రమంలో భాగంగా బెంగ ళూరు చెందిన సతీష్, దివ్యశ్రీ మ్యూజిక్ అండ్ డాన్స్ బృందం ఆధ్వర్యంలో కళాకారులచే సాంస్కృతిక నృత్య ప్రదర్శన నిర్వహించారు. పుష్పాంజలి అనే గేయంతో తో మొదలై అలరిప్పు, కీర్తనం, స్వరావళి, దేవరణమ, శబ్దం, వర్ణం, నాగ స్తుతి, మూకాంబిక అష్టకం, మంగళం తదితర పాటలకు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. తిరుపతి పరిసరాలలోని గ్రామస్తులు పెద్ద సంఖ్యలో సాంస్కృతి ప్రదర్శనలు వీక్షించి ఆనందించారు.

## అశ్వవాహనంపై శ్రీ ముత్తుమారెమ్మ ఉత్సవం

కుప్పం, మే 18 ప్రభాతవార్త

కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం రాత్రి శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ అమ్మవారి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ ముత్తుమారెమ్మ అమ్మవారిని రెండు అశ్వవాహనాల్లో పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నేతలు, పూజారులు పాల్గొన్నారు. కాగా రాత్రి బస్టాండు వద్ద సత్య మాస్టర్ బృందంచే డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. వ్యాఖ్యాతగా ప్రముఖ నటి హరితేజ వ్యవహరించారు. ఈకార్యక్రమం తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## శివయ్య సేవలో త్రిపుర మాజీ సిఎం

శ్రీకాళహస్తి, మే 18 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిపలాబ్ కుమార్‌దేబ్ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి రాకసందర్భంగా రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాస్‌లు ఘనస్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనం తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అ మ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి డాక్టర్ నరేష్, యువమోర్చా సభ్యులు సజ్జాహరీష్, సిద్దురాయల్, గిరిధర్‌సాయి, తులసిరామ్, బిందురాయల్, పవన్, ప్రదీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కడపలో మహానాడు ఏర్పాట్లలో కేవీబీపురం టీడీపీ నేతలు



*కేవీబీపురం, మే 18 ప్రభాతవార్త:* తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస యాదవ్‌ని కడపలో కేవీబీ పురం మండల టీడీపీ సీనియర్ నేతలు రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబునాయుడు, తిరుపతి పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి లోకేష్‌చౌదరి, తిరుపతి పార్లమెంట్ పాలేగార్ సంఘ కన్వీనర్ వెంకటకృష్ణయ్య, పవనవారికండ్రిగసర్పంచ్ చెంచుప్రకాష్ యాదవ్ తదితరులు ప్రత్యేకంగా కలిశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే మహానాడు సభా స్థలాన్ని, సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహానాడు విధి విధానాలు గురించి రాష్ట్ర అధ్యక్షుడు పల్లాతో నేతలు చర్చించారు.

## ప్రభుత్వ ఉద్యోగుల కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయండి

తిరుపతిరూరల్, మే18 ప్రభాతవార్త:

విజయవాడలో జూన్ 5న జరగబోయే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, జిల్లా అధ్యక్షుడు వైజెపి ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాళ్ళు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేసే అన్నిశాఖల, తరగతుల ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తూ, ప్రభుత్వ గుర్తింపు పొంది, రాష్ట్ర సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్యత్వం కలిగిన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కెఆర్ నారాయణ ఆదేశాల మేరకు గోడ పత్రికను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అందరూ పాల్గొని ఐక్యతను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, కోశాధికారి మధుబాబు, పురుషోత్తంరెడ్డి, లక్ష్మీకర్‌రెడ్డి, నారపరెడ్డి కిరణ్, రాజేష్, మధు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఏను మర్యాదపూర్వకంగా కలసిన తుడా ఛైర్మన్

శ్రీకాళహస్తి, మే 18 ప్రభాతవార్త



తుడా ఛైర్మన్‌గా నియమితులైన డాలర్స్ దివాకర్‌రెడ్డి శనివారం శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తుడా ఛైర్మన్‌గా నియమితులైన డాలర్ దివాకర్‌రెడ్డిని దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని డాలర్స్ దివాకర్‌రెడ్డిని కోరారు.

## ఏపి జిఎంపి నూతన కమిటీ ఎన్నిక

శ్రీకాళహస్తి, మే 18 ప్రభాతవార్త



పట్టణంలోని ఎంజిఎం ఆస్పత్రిలో ఆదివారం ఏపి జిఎంపి(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్) సర్వసభ్య సమావేశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసమావేశానికి ఎంజిఎం ఆస్పత్రి గుండె వైద్యనిపుణులు డాక్టర్ వివేక్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన జీఎంపి సభ్యులకు గుండెకు సంబంధించిన వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాళహస్తి డివిజన్ ఏపి జిఎంపి అధ్యక్షులుగా మావిళ్లపల్లె వెంకటేశ్వర్లు, సంయుక్తకార్యదర్శిగా టి.సురేష్‌రెడ్డి, ట్రెజరర్‌గా వీరయ్య, కమిటీ సభ్యులుగా రాంబాబు, బాలాజీ, తులసమ్మ, నాగరాజునాయుడు, రాజేంద్రకుమార్‌రెడ్డి, ఎస్.ఎం.భాషలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుల కెవిఎన్.రాజు, జిల్లా కార్యదర్శి ఏడుకొండలు, అసోసియేషన్ సీనియర్‌సభ్యులు మోహన్, శివశంకర్, మాల్యాద్రి, కళ్యాణ్‌రాజు మరియు జిఎంపి సభ్యులు పాల్గొన్నారు.

## యాదవుల అభివృద్ధికి ప్రతి ఒక్కరు ముందుకురావాలి

### –ఆలిండియా వర్కింగ్ అధ్యక్షుడు



**.శ్రీకాళహస్తి, మే 18 ప్రభాతవార్త** యాదవుల అభివృద్ధికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆలిండియా వర్కింగ్ అధ్యక్షుడు సోంప్రకాష్ యాదవ్ పిలుపునిచ్చారు. సమావేశం పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీకి సమీపంలో ఉన్న శ్రీకృష్ణమందిరంలో డాక్టర్ చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి జిల్లా జోనల్ కార్యదర్శి మునస్వామియాదవ్, రాష్ట్ర అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షురాలు మహేశ్వరిలు హజరయ్యారు. ఈసందర్భంగా రాష్ట్ర యాదవ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నరసింహయాదవ్ మాట్లాడుతూ యాదవుల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా తన వంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తిలో యాదవ కళ్యాణ మండపం నిర్మాణానికి చర్యలుతీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డాక్టర్లు, న్యాయవాదులు, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులుతో పాటు డాక్టర్ చంద్రయ్యయాదవ్, డాక్టర్ ఉమాపతియాదవ్, అక్షింతల బలరాంయాదవ్, మేకలజయరాంయాదవ్, దత్తాత్రేయ యాదవ్, వంకాయల రమణయ్యయాదవ్, డాక్టర్ ప్రవీణ్‌యాదవ్, మణి యాదవ్, ధర్మయ్యయాదవ్, ఏపిఎన్‌జిజివో శ్రీకాళహస్తి తాలూకా అధ్యక్షుడు చెంచురత్నంయాదవ్ తదితరులు హజరయ్యారు.

## తొట్టంబేడు గ్రామంలో కార్డెన్ సెర్చ్

### -11 ద్విచక్రవాహనాలు, 1 ఆటో సీజ్

.తొట్టంబేడు, మే 18 ప్రభాతవార్త



మండలకేంద్రమైన తొట్టంబేడు గ్రామంలో సిఐ తిమ్మయ్య, సిబ్బందిలు కలసి కార్డెన్ మరియు సెర్చ్ నిర్వహించి సరైన రికార్డులు లేని 11 ద్విచక్రవాహనాలు, మరియు 1 ఆటోను కనుగొని సీజ్‌చేసినట్లు సిఐ తెలిపారు. ఇన్ని ద్విచక్రవాహనాలు సీజ్‌చేయడం అది మండల కేంద్రమైన తొట్టంబేడు గ్రామంలో ఇదే ప్రథమం అని సిఐ తెలిపారు. ప్రతి వాహనదారుడు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులతో పాటు లైసెన్సులు కలిగి ఉండాలని లేదంటే జైలు జీవితం తప్పదన్నారు. ప్రతి గ్రామంలో ఇకపై కార్డెన్ సెర్చ్ తనిఖీలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీల వల్ల చోరీకి గురైన వాహనాలను కనుగొనడంతో పాటు దొంగలను పట్టుకోవచ్చన్నారు. తనిఖీల్లో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలపై దృష్టి సారించండి:రేణిగుంట దాహార్తిని తీర్చండి

### మినీమహానాడులో నాయకుల విన్నపం

శ్రీకాళహస్తి, మే 18 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని సమస్యలపై దృష్టి సారించాలని మినీమహానాడులో వివిధ మండలాలకు చెందిన నాయకులు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మినీమహానాడులో పలువురు నాయకులు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు గ్రామాల్లో నీరు చెట్టు కార్యక్రమాల్లో పనులు చేసిన వారు ఇబ్బందులుపడుతున్నారని మినీ మహానాడులో తీర్మానం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. సిసి రోడ్లు, మినీ గోకులాలు నిర్మించిన కార్యకర్తలు చెల్లింపులు లేక తల్లడిల్లుతున్నారన్నారు. రేణిగుంటకు చెందిన బాషా మాట్లాడుతూ గతంలో గోపాలకృష్ణారెడ్డి మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేసారని, ప్రస్తుతం రూ.31కోట్లు మంజూరు అయ్యాయని నేడు మంచినీటి సమస్య ఉందని వివరించారు. వివిధ సమస్యలపై రేణిగుంట మండల నాయకుడు చంద్రారెడ్డి, శ్రీకాళహస్తి మండల నాయకుడు కామేష్‌యాదవ్, తొట్టంబేడు మండల నాయకుడు గాలి మురళినాయుడు మాట్లాడారు.

***రిటైర్‌మెంట్‌లు ఉండవు : ప్రమోషన్లే . . .***

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నాయకులకు రిటైర్‌మెంట్‌లు ఉండవని, ప్రమోషన్లే అన్నారు. పార్టీ అధిష్ఠానం మూడు సార్లు ఉన్న వారికి మళ్ళీ అవకాశం ఉండకూడదన్నారు. ఎవరైతే సీనియర్లు ఉంటే వారికి జిల్లా రాష్ట్ర స్థాయి పదవులు ఇప్పిస్తామన్నారు. సమావేశంలో జి.విజయకుమార్, చెంచయ్య నాయుడు, పొన్నారావు, ధనంజయులు నాయుడు, చంద్రారెడ్డి, రేణుకా దేవి, బాషా, జిలాని, దశరధాచ్చారి, ఒరెడ్డివారి గురువారెడ్డి, తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, మిన్నల్ రవి, పేట బాలాజి, వెంకటసుబ్బారెడ్డి, తాటిపర్తి రవీంద్రరెడ్డి, చెలికం పాపిరెడ్డి, షాకిర్ అలి, పేరం నాగరాజునాయుడు, ఇర్ల గోపి, మునిరాజానాయుడు, కామేష్‌యాదవ్ గాలి మురళినాయుడు, సుమతి, సుధాకర్, మీడియా ప్రతినిధి నాగమల్లి దుర్గా ప్రసాద్, బాలాజి తదితరులు ఎపాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## తుడ ఛైర్మన్ పదవి దివాకర్‌రెడ్డికి ఇవ్వడం అభినందనీయం



***తిరుపతి కలెక్టరేట్, మే 18 ప్రభాతవార్త*** టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, డాలర్స్ గ్రూపు అధినేత డాక్టర్ సి.దివాకర్‌రెడ్డికి సిఎం చంద్రబాబునాయుడు తుడ ఛైర్మన్ పదవి ఇవ్వడం అభినందనీయమని తుమ్మలగుంటకు చెందిన టీడీపీ సీనియర్ నేత బిరుదాల కృష్ణారెడ్డి, తనయుడు టీడీపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు బిరుదాల హనుమంతురెడ్డి పేర్కొన్నారు. వారు ఆదివారం మీడియాతో మాట్లాడారు. పేదల పక్ష పాతిగా, ప్రజా సేవకుడిగా, టీడీపీ పార్టీ విధేయుడిగా, రియల్ ఎస్టేట్ వ్యాపారిగా చిన్న వయస్సులోనే తాను పుట్టిన పెరుమాళ్ళపల్లె గ్రామం నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ అందరివాడిగా డాలర్ దివాకర్‌రెడ్డి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారని కొనియాడారు. తుడాను అభివృద్ధి చేసి సంస్థ ప్రతిష్టను పెంచుతారని తెలిపారు. తాము, కుటుంబ సభ్యులు టీడీపీ పార్టీకి కార్యకర్తల్లా, సైనికుల్లా పనిచేస్తున్నామని బిరుదాల హనుమంతరెడ్డి తెలిపారు.

## పద్మాశాలీ వంశస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం



**నారాయణవనం, మే 18 ప్రభాతవార్త :** కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు బుధవారం జరిగిన రథోత్సవం, కల్యాణోత్సవం సందర్భంగా జిల్లా పద్మాశాలీ వంశస్తుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం వేలాదిమంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాయలసీమ పద్మాశాలీ వంశస్తుల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో పద్మాశాలీ వంశస్తుల ఆధ్వర్యంలో అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తున్నది. అలాగే రాత్రి జరిగిన కల్యాణోత్సవం సందర్భ ంగా పట్టుసారెను ఎగువపదా ్మశాలీవీధిలోని భద్రావతీ సమేత భావనారుషీ ఆలయం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భాణాసంచావేడుకలనడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి టిటిడి అధికారులకు అందించారు.

## కల్యాణవేంకటేశ్వరుని కల్యాణోత్సవానికి పట్టుసారె వితరణ

నారాయణవనం, మే 18 ప్రభాతవార్త :

నారాయణవనంలో ప్రసిద్ది చెందిన టిటిడి ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు ఆదివారం రాత్రి 8గంటలకు జరిగిన కల్యాణోత్సవానికి సంబందించి నారాయణవనం పద్మశాలి కులస్తులు పట్టుసారేను ఊరేగింపుగా తీసుకెళ్లి అందజేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి టిటిడి అధికారులకు పట్టుసారేను అందజేశారు. సాంప్రదాయం ప్రకారం తరతరాలుగా బ్రహ్మోత్సవం సమయంలో జరిగే కల్యాణోత్సవానికి పట్టుశారేను అందజేయడం ఆనవాయితీగా వస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీవంశస్తులు అచ్చుకట్ల హరి, ఆర్టీసి పెరుమాల్, ఎస్ఎస్.గిరిబాబు, తిరుమలశ్రీనివాసులు, శంకర్, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

## భారత సైనికుల ధైర్య సాహసాలు ఎనలేనివి

### – బీజేపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కాయం హరినాథరెడ్డి

రామచంద్రాపురం, మే 18 ప్రభాతవార్త :



భారత సైనికుల ధైర్య సాహసాలు ఎనలేనివి అని బీజేపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కాయం హరి నాథ్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం రామచంద్రాపురం కూడలిలో భారత సైనికులకు మద్దతుగా బీజేపీ మం డల పార్టీ అధ్యక్షుడు జనార్ధనాయుడు ఆధ్వర్యంలో కూటమి నాయకులతో కలిసి తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సైన్యం చేపట్టిన సింధూర్ ఆపరేషన్ ఎంతో సాహసోపేతమైన నిర్ణయం అన్నారు. భారతీయుల ధైర్య సాహసాలకు సింధు ఆపరేషన్ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి భారత పౌరుడు మన సైన్యానికి అండగా నిలిచి విదేశీ శత్రువులను తరిమికొట్టాలన్నారు. భారత సైనిక శక్తి ప్రపంచ దేశాలకు తెలియజేసిన ప్రధాని మోడీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంజీవ హరి, టీడీపీ నాయకులు జనార్ధన్ చౌదరి, నరిసింహారెడ్డి, ఆవుల సిద్దయ్య, తాటి రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ నాయకులు సందేశ్వర్‌రెడ్డి, మున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూ విసిగా బీసీ ప్రొఫెసర్లనే నియమించండి



**తిరుపతి విద్య, మే 18 ప్రభాతవార్త** శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి రెగ్యులర్ వైస్ ఛాన్సర్గా అర్హులైన బీసీ ప్రొఫెసర్లను నియమించాలని ఆదివారం రాష్ట్ర బీసీ కులాల సమన్వయ కమిటీ నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో వివిధ బీసీ కుల సంఘాల నాయకులతో సమావేశమ య్యారు .బీసీ కులాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కేతే నారాయణస్వామి గౌడ్ మాట్లాడుతూ 70 సంవత్సరాలు చరిత్ర కలిగిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం భారతదేశంలోనే విశిష్టమైన గుర్తింపును కలిగి ఉన్నది. ఇక్కడ విద్యనభ్యసించినవారు దేశంలో వివిధ రంగాల్లో స్థిరపడ్డారు తెలుగుదేశం పార్టీ పరిపాలనలో ఎస్వియుకు ఇప్పటివరకు రెగ్యులర్ వైస్ ఛాన్సర్ పదవిని బీసీ ప్రొఫెసర్లకు ఇవ్వలేదు. త్వరలో నియమించబోయే రెగ్యులర్ వైస్ ఛాన్సర్ పదవిని ఎస్వీయూలో అర్హులైన బిసి ప్రొఫెసర్లకు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను తిరుపతి కేంద్రంగా కోరారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ అమరావతిలో యూనివర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశమవుతున్న సందర్భంగా ముఖ్య మంత్రి ఎస్వీ యూనివర్సిటీకి అర్హులైన బిసి ప్రొఫెసర్లను వి సి గా నియమించి బీసీలకు వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుసగాని లక్ష్మయ్య యాదవ్, సాకం ప్రభాకర్, విడగొట్టి రమణ, వెంకటరమణ, ఈశ్వరయ్య గౌడ్, భరత్, నాగరాజు, బాలాజీ, బాలాజీ, శేఖర, మునిరత్నం, దీపక, యాదవ్ , శ్రీనివాసులు ఉన్నారు.

## హెల్మెట్లు ధరించండి... ప్రాణాలు కాపాడుకోండి

### రూరల్ సీఐ మంజునాథరెడ్డి

***రేణిగుంట, మే 18 ప్రభాతవార్త*** ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణాలు (హెల్మెట్లు) ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని రూరల్ సీఐ మంజునాథరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు సూచనలతో రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని పాపానాయుడుపేట క్రాస్ వద్ద ఆదివారం పోలీసులు వాహన తనిఖీలను నిర్వహించారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. డ్రైవర్ల లైసెన్స్ లను పరీక్షించారు. అనంతరం సీఐ మంజునాథరెడ్డి ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ల పై అవగాహన కల్పించారు. హెల్మెట్లు ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. హెల్మెట్ల ధరించకపోవడం వల్ల ఎంతోమంది ప్రమాదాల్లో తలలు పగిలి మరి కొంతమంది తలలకు బలమైన గాయాలు తగిలి మృతి చెందారన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలను నడపకూడదన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని తల్లితండ్రులను కోరారు. రికార్డులు సరిగ్గా లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోక తప్పదు అన్నారు. కౌన్సిలింగ్ ఇచ్చిన వారిలో గాజులమండ్యం ఎస్సై సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములుకు భారతరత్న ప్రకటించాలి

శ్రీకాళహస్తి, మే 18 ప్రభాతవార్త




రాష్ట్ర కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించి గుర్తింపు ఇవ్వాలని ఆదివారం రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభ కార్యదర్శి అయితే మురళి డిమాండ్ చేసారు. ఆదివారం పట్టణంలోని బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన 125 జయం తోత్సవాల కార్యక్రమంలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికి అమ్మవారి ఆత్మా ర్పణ దినోత్సవాన్ని రాష్ట్ర కార్యక్రమంగా గుర్తించటం ఆర్యవైశ్యులకు ఇస్తున్న గుర్తింపుకు నిదర్శనం అన్నారు. ఇందుకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. అమరజీవి సేవలను గుర్తించి భారత రత్న ప్రకటించాలని కోరారు. ఈ సందర్బంగా అమరజీవి చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. భారత రత్నకు రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో అయితా మురళితో పాటు అమ్మవారి పాలకమండలి అధ్యక్షులు తేరాల పురుషోత్తం, ఇతర సభ్యులు మెంటా సుబ్బారావు,, ఇమ్మిటిశెట్టి మోహన్, పెసల వెంకటరత్నం,, వి.పి మూర్తి, కొండా సతీష్, ఇతా శ్రీనివాసులు, కుందాం మోహన్, పేర్ల రమేష్, కొత్త సురేష్, వెంకటేశ్, మధు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

# గంగ నీటి కోసం రైతులు భగీరథ యత్నం

-పది రోజులుగా గంగా అధికారులు చుట్టూ ప్రదక్షణలు
-కాలువ గట్లపై పడుగాపులు -గంగ జలాలు అందకుంటే రైతుకు సాగు కష్టాలతో పాటు నష్టాలు తప్పవు

చిట్టమూరు, మే 18 ప్రభాతవార్త : దేశానికి పట్టెడన్నం పెట్టే రైతన్నలు ప్రస్తుతం దిక్కు తోయని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఓవైపు ప్రకృతి వైపరీత్యాలు మరోవైపు పంటకు గిట్టుబాటు ధర వెరసి వ్యవసాయం సంక్షోభంలోకి పోయిన నేపథ్యంలో అన్నదాతలు అన్ని విధాల కష్టనష్టాలను ఎదుర్కోక తప్పడం లేదు. ప్రభుత్వం,పాలకులు రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని చెబుతున్న ఊక దంపుడు ఉపన్యాసాలు కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి తప్ప రైతులకు ఏ విధంగా ప్రయోజనకరంగా లేవు. ఖరీఫ్ లో సాగునీటి కోసం చిట్టమూరు మండల వ్యాప్తంగా చేస్తున్న రైతు ఉద్యమాలు,పడుతున్న కష్టాలు పాకిస్తాన్ యుద్ధాన్ని తలపిస్తుంది.గంగ జలాలు చిట్టమూరు మండలంలోని కొన్ని ప్రాంతాలకు వస్తాయన్న నమ్మకంతో అన్నదాతలు విస్తారంగా నారుమళ్ళ సిద్ధం చేసుకున్నారు. గత పది రోజులుగా ఎల్లసిరి చెరువు ఆయకట్టు సంఘం ఉపాధ్యక్షులు, మండల బీసీ సంఘం అధ్యక్షులు ఆపులూరు చెంచు రామాచారి ఆధ్వర్యంలో ఎల్లసిరి,అరవపాలెం బయ్య వారి కండ్రిగ తదితర గ్రామాలు రైతులు గంగ జలాల కోసం అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే ఖరీఫ్ పంటల సాగుపై ఆయకట్టు రైతులకు గంగ బెంగ పట్టకుంది.ఏప్రిల్ లోనే తెలుగు గంగ ద్వారా పంటలకు ప్రభుత్వం నీరందిస్తామని ప్రకటన చేసింది.మే నెల రెండవ వారం అయినా నీరందక పోవడంతో తెలుగు గంగ నీటిపై ఆధారపడ్డ చిట్టమూరు మండల రైతాంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం పర్యవేక్షణా లోపం వెరసి సాగుపై సందిగ్ధం నెలకొనగా ఆయకట్టు రైతుల గుండెల్లో గుబులు పట్టుకుంది. సకాలంలో గంగనీరు అందకుంటే పంటకు కష్టం,నష్టం తప్పదని,సరిపడా నీరిచ్చి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.రైతుల అభిప్రాయం మేరకు గంగ అధికారులు సకాలంలో సరిపడా నీరివ్వకుంటే చిట్టమూరు మండలంలోని దాదాపు 10కి పైగా గ్రామాలకు చెందిన రైతులు నష్టపోయే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల సాగు నీటి అవసరాలను 7వ బ్రాంచ్ కెనాల్ ద్వారా చిట్టమూరు మండలంలోని యాకసిరి, ఎల్లసిరి, కొగిలి తద్వారా చిట్టమూరు మండలం లోని మేజర్ చెరువులకు తెలుగంగ ద్వారా సాగు నీరు అందించే కాలువలు ఏర్పాటు చేశారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రబీలో రైతాంగం పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేసి ఆఖరి తడికి గంగ నీటిని విడుదల చేయించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఏటా రెండో పంటకు గంగ నీటిని గత ప్రభుత్వ హయాంలో విరివిగా విడుదల చేశారని దీంతో సాగు సజావుగా సాగిందన్నారు. 7వ బ్రాంచ్ కెనాల్ మార్గ మధ్యంలో నాయుడుపేట మండలంలోని పూడేడు,అరవ పెరిమిడి, రామారెడ్డికండ్రిగ గ్రామాలకు చెందిన రైతులు పెద్దపెద్ద తూములను ఏర్పాటు చేసి గంగ నీటిని అక్రమం గా తరలిస్తుండడంతో దిగువ ప్రాంత గ్రామాలకు పూర్తి స్థాయిలో నీరందక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయ న్నారు. ఎగువ ప్రాంతాల నుండి విడుదల చేసిన సాగు నీటిని నిర్దేశిత ప్రాంతాలకు అందించాలన్న చిత్తశుద్ధి అధికారుల్లో లేకపోవడం,లక్ష్య సాధనలో అధికారుల నిర్లక్ష్యం బాధ్యత రాహిత్యం,పర్యవేక్షణాలోపం వెరసి దిగువ ప్రాంత రైతాంగానికి శాపంగా మారాయన్నారు. దీంతో ఆశించిన మేర గంగనీరు క్షేత్ర స్థాయికి చేరడం లేదని రైతులు వాపోతున్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే విషయాలలో పాలకులు,ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ప్రస్తుతం సరైన నీటి నిల్వలు ఉండి విడుదల చేస్తామని ప్రకటించి సక్రమంగా అందించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈసారి తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంట దిగుబడి తగ్గి మద్దతు ధర లేక కష్ట నష్టాలెదుర్కొన్న రైతాంగానికి మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందాగా ప్రస్తుతం పరిస్థితి దాపురించిందన్నారు. ఉన్నంతలో కొంతైనా రెండో పంట సాగుతో అప్పుల భారం తగ్గుతుందని ఆశించిన రైతాంగానికి గంగ నీరందకపోవడంపై అయోమయంలో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పంటలకు నీళ్లొస్తాయన్న ఆశతో సాగు చేపట్టిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.రైతాంగ ఆశలు నెరవేర్చేలా సరిపడా గంగనీటిని విడుదల చేయాలని అన్నదాతలు ఈ సందర్భంగా కోరుతున్నారు.



నాటులకు సిద్ధంగా వున్న నారుమడులు

# గూడూరు డివిజన్

## మహానాడును విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే పాశం



గూడూరు, మే 18 ప్రభాతవార్త : ఈ నెల 27 28 29 తేదీల్లో కడపలో జరుగు మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుడూరు నియోజకవర్గంలో ఉన్న నాయకులు కార్యకర్తలుకి పిలుపు నిచ్చారు ఆదివారం గూడూరు పట్టణ పరిధిలోని సిఆర్ రెడ్డి కళ్యాణ మండపం నందు నియోజక వర్గ స్థాయి నాయకులు కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసింహ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగతేత ఏంటి రామారావు జన్మదిన పుష్కరించుకొని ప్రతి ఏడాది లాగే ఈ యాదాది కడపలో మూడు రోజులు పాటు మహానాడు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనవని మామ తగ్గ అల్లుడు ప్రస్తుత నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ఇండియాలోనే ఆంధ్ర ప్రదేశ్ మొదటి స్థానంలో నెలపాలన్న ముఖ్య ఉద్దేశంతో పనిచేస్తున్నారని అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీ సేలం కిరణ్ కుమార్, మట్టం శ్రావణి, ఆరికట్ల మస్తాన్ నాయుడు, అబ్దుల్ రహీం, వెంకటేశ్వర్‌రెడ్డి, మద్దాల సర్వతం రెడ్డి, మధుసూదన్ రెడ్డి గణపతి, కిషోర్ నాయుడు, గుండాల భారతి, గుండాల లీలావతి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, పొలిమ్ శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వరరాజు, పాపారెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి, అజిత్‌రెడ్డి, నేలబల్లి భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆరికట్ల మస్తాన్ నాయుడు, ఏరుపాక పెంచలయ్య, పెద్ద ఎత్తున పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కమ్మేస్తున్న కార్బైడ్ విషం... ప్రభుత్వ నిషేధాజ్ఞలు అమలుకాని వైనం



కోట,మే 18 ప్రభాతవార్త : మామిడి ..పండు చూడ.. మేలిమై ఉండు.. రుచి చూడగా చప్పగా ఉండు.. మంచి రంగులతో నిగనిగలాడుతున్న మామిడిని ఇష్టపడనివారెవరు? ఎంత ఖరీదైనా కొని తీసుకెళ్తున్నారు. తినేటప్పుడుగానీ దాని అసలు రంగు బయటపడటం లేదు. రసాలు గాని, బంగినపల్లి కాని, ఏ మాత్రం రుచిపచీ లేకుండా ఉటున్నాయి. సహజసిద్ధమైన రుచిని పూర్తిగా కోల్పోతున్నాయి. కారణం రసాయనాలతో ముగ్గబెట్టడమే.. జిల్లా వ్యాప్తంగా కార్బైడ్‌తో ముగ్గబెట్టిన పండ్లనే వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఈ పద్ధతిని ఏనాడో నిషేధించినాజ... అడ్డుకోవడంలో అధికారులు విఫలమ వుతున్నారు. పక్వానికి రాని కాయలను సైతం కోసేసి కారైడ్‌తో ముగ్గబెతున్నారు. దీని వాడితే ఒకట్రెండు రోజుల్లోనే కాయలకు రంగు వస్తుంది. పైకి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఇవి తింటే వాంతులు, విరేచనాలు,ఊపిరితిత్తుల సమస్యలతో పాటు క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.ఎర్ర రక్తంలో కణాలు విచ్ఛిన్నమైన రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గుతుందన్నారు. తప్పదనుకుంటే 12 గంటల సేపు నీటిలో నాన బెట్టి తింటే మంచిదని చెప్పుతున్నారు. కానీ కార్బైడ్‌తో మామిడిని ముగ్గబెడుతున్నట్లు దుకాణదారులు చెపుతున్నా ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు అసలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు సైతం ఉన్నాయి.

## పార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యుల పర్యటన పూర్తి





శ్రీహరికోట (తడ), మే 18 ప్రభాతవార్త : శ్రీహరికోటలోని సతీష్ దావన్ అంతరిక్ష కేంద్రం (షార్)లో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ పార్లమెంటరీ స్థాయి సంఘం రెండు రోజుల పాటు పర్యటించింది. శ్రీహరికోట అభివృద్ధి గురించి భవిష్యత్తు ప్రయోగాలు ఇస్రో పెట్టుబడులు పై ఈ కమిటీ చర్చించినట్లు సమాచారం. ఇస్రో చైర్మన్ వి. నారాయణన్‌తో పాటు పలువురు అధికారులు, శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహించారు. షార్‌లోని వివిధ అంతరిక్ష పరిశోధనా కేంద్రాలను సందర్శించారు. ప్రయోగ వేదికలు మిషన్ కంట్రోల్ సెంటర్‌తో పాటు షార్ కేంద్రం ఏర్పడ్డ తొలిరోజుల్లో నిర్మాణం జరుపుకున్న కొన్ని ప్రాజెక్టులను కూడా వీరు పరిశీలించారు. స్థానిక నక్షత్ర అతిథి గృహంలో బస చేయడం కాకుండా కీలక సమావేశాలు జరిపినట్లు తెలిసింది. 18 మంది ఎంపీలతో కూడిన ఈ బృందంలో మరి కొంత మంది అధికారులు కూడా పాల్గొన్నారు. ఆదివారం ఉదయం ఇక్కడ మిషన్ కంట్రోల్ సెంటర్‌ను చేరుకొని పిఎస్ఎల్‌వి సి 61 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించారు. అయితే ఆ ప్రయోగం వైఫల్యం చెందడం శాస్త్రవేత్తలతో పాటు ఈ కమిటీ బృందాన్ని కూడా బాధించింది. ఆదివారం శ్రీహరికోట నుండి వీరు తిరుగు ప్రయాణం అయ్యారు. రాకెట్ ప్రయోగ వీక్షణను తిలకించిన ఈ బృందం ఇస్రో కెమెరాలలో చిత్రికరించబడ్డారు. అయితే రెండు రోజుల పర్యటన గురించి షార్ యాజమాన్యం మాత్రం మీడియాకు తెలియకుండా గోప్యంగా ఉంచడం విశేషం. కొందరు ఎంపిలు తమ పర్యటన ఫోటోలను సామాజిక మాధ్యమాలలో ఉంచారు.

**- నేడు యువికా కార్యక్రమం ప్రారంభం :**

యువ శాస్త్రవేత్తలను తయారు చేయడానికి దేశంలోని యువతకు అంతరిక్ష పరిశోధనలపై శిక్షణ ఇచ్చే యువికా కార్యక్రమం సోమవారం ప్రారంభం కానుంది. యువ శాస్త్రవేత్తలను తయారు చేయడమే ఇస్రోతో పాటు కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. 2025 యువికా కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 350 మంది పిల్లలు ఎంపికైనట్లు తెలిసింది. వీరిని ఏడు బృందాలుగా విభజించి దేశంలోని వివిధ అంతరిక్ష కేంద్రాలలో 50 మంది చొప్పున శిక్షణ పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. షార్‌కు కూడా 50 మంది యువికాకు ఎంపికైన యువత చేరుకున్నారు. సోమవారం ఇస్రో చైర్మన్ వి నారాయణన్ చేతులు మీదుగా దేశ వ్యాప్తంగా ఉన్న ఏడు ఇస్రో ప్రధాన కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ నెల 30 వరకు వీరికి శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణా తరగతులలో పలువురు అంతరిక్ష పరిశోధన నిపుణులు పాల్గొంటారు.

## విద్యానగర్‌లో సినినటులు సందడి



కోట,మే 18 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లోని ఒ వెంచర్ ప్రారంభత్సంను ఆదివారం జబర్దస్త్ సిని నట్లు బుల్లెట్‌భాస్కర్, నరేష్, జితేంద్ర. పలువురు హస్య నటులు విచ్చేశారు.ఈ సందర్భంగా వారు పలు హస్యలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వారిని చూసేందుకు ఈ ప్రాంత ప్రజలు తరలి వచ్చారు.ఆటు క్రిస్‌సిటి, ఇటు వాకాడు మండలం తూపిలిపాళెంలో నిర్మించబోతున్న పిషింగ్ హర్బ్‌తో పాటు సాగరమాల ఆరు లైన్ల రోడ్లుకు ఏంతో దగ్గరలో ఉన్నఈ వెంచర్‌లో అన్ని హంగులతో ఉందన్నారు. మహ నగరంగా విద్యానగర్ మారిపోతుందన్నారు. రాబోవు కాలంలో ఈ ప్రాంతం మున్సిపాలిటిగా రూపాంతరం చెందుతుందన్నారు. ఈ కార్యమ్రంలో దూవ్వూరు మదుసూధన్ రెడ్డి, దూవ్వూరు రఘరామిరెడ్డి, ఉచ్చూరు రవీంద్రారెడ్డి, రాఘవేంద్ర, తదితరులు పాల్నోరు.

## కార్యకర్తల్ని గుండెల్లో పెట్టుకుంటా

సమస్యలుంటే పరిష్కరించుకోవాలి-గ్రూపులను సహించను
-మినీ మహానాడులో బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి,మే 18 ప్రభాతవార్త : తెలుగుదేశం కుటుంబసభ్యులు, కార్యకర్తల్ని గుండెల్లో దాచుకుంటానని, వారిని ఆర్థికంగా అభివృద్ధికి చేయూత నిస్తానని, పార్టీలో సమస్యలుంటే పరిష్కరించుకోవాలి తప్ప, గ్రూపులను ప్రోత్సహిస్తే సహించేది లేదని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. ఆది వారం ఎన్‌టిఆర్ భవన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన మినీమహానాడు విస్తృతస్థాయి సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును 20సంవత్స రాలు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఆయన తరువాత నారా లోకేష్ ముఖ్యమంత్రి అవుతారని వివరించారు. కొందరు కార్యకర్తలు తన వద్దకు రావటానికి భయపడుతున్నట్లు చెబుతున్నారని, తాను మీ కుటుంబంలో ఒకడినని మీ అన్న, మీ తమ్ముడు, మీ బిడ్డగా భావించాలని ఆయన అన్నారు. పార్టీలో ఏవైనా అభిప్రాయభేదాలుంటే కూర్చొని మాట్లాడుకోవాలని పరిష్కరించుకోవాలని, చూరు ఎక్కి కూస్తానంటే సహించేది లేదన్నారు. తెలుగుదేశం అంతా ఒకే కుటుంబం అని స్పష్టం చేసారు.





**పనులన్ని కార్యకర్తలకే :**

నియోజకవర్గంలో పనులన్ని ఆయా ప్రాంతాల్లోని కార్యకర్తలకే అప్పగిస్తున్నానని అధికారుల నియామకం మండల నాయకులు చెప్పివారికి సిఫార్సు చేస్తున్నామని స్పష్టం చేసారు. మండలానికి రూ.3కోట్లు మంజూరు చేసారని ఆ నిధులు ఆయా మండలాల్లో ఉన్న కార్యకర్తలకే అప్పగించి వారిని ఆర్థికంగా పటిష్టం చేస్తున్నామన్నారు. కాలం మారిందని నేడు సాంకేతిక పరిజ్ఞానంతో పరిపాలన సాగుతుందని వాట్స్‌ప్ ద్వారా ఏ సర్టిఫికేట్ కావాలన్నా వస్తుందని వివరిస్తూ ఏ కార్యాలయంలో అయినా పనుల కోసం వచ్చిన వారి వద్ద అధికారులు చేయిసాస్తే సహించేది లేదని స్పష్టం చేసారు. అయిదు సంవత్సరాలు కష్టాలు పడ్డాం, పోరాటాలు చేసాం, కేసులు పెట్టించుకొని, లాఠీ దెబ్బలు తిన్నాం. నాతో కలసి నడిచిన వారికి మొదటి ప్రాధాన్యత అన్నారు. ఎన్నికల ముందు నేటి ప్రతిపక్షం కారుకూతలు కూస్తూ నన్ను గెలిపిస్తే హైదరాబాదులో మకాం పెడతామనన్నారు. కానీ ఐదేళ్ళలో వాళ్ళు దోచుకో దాచుకో అని పరిపాలిస్తేన పదకొండు నెలల పాలనలో తాను అభివృద్ధి అంటే ఏమిటో చూపించానన్నారు.

**ఆరునెలలో కృష్ణ జన్మస్థానం తథ్యం:**

శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని ఐదు సంవత్సరాల పాటు అన్ని రంగాల్లో దోచుకున్నారని మా కార్యకర్తల్ని ముప్పు తిప్పలు పెట్టారు. వారి పేర్లు అన్ని తన వద్ద ఉన్నాయని అయితే తమ నాయకుడు గెలిచిన కొత్తల్లో ఆవేశం కాదు ఆలోచన ఉండాలని సూచించారన్నారు. అయితే నాలుగైదు నెలల లోపల శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యునికి శ్రీకృష్ణ జన్మస్థానం తథ్యమని ప్రకటించారు. ఎవరి చేసిన పానాలకు వారే శిక్ష అనుభవించక తప్పదని స్పష్టం చేసారు.మినీ మహానాడుకు పర్యవేక్షకులుగా బుచ్చయ్య చౌదరి హాజరయ్యారు. పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ పర్యవేక్షణలో సమావేశం జరిగింది. నియోజకవర్గంలోని నాయకులందరూ హాజరయ్యారు.

## స్మశానం స్థలం ఆక్రమించారని పోలీసులకు ఫిర్యాదు



బాలాయపల్లి, మే 18 ప్రభాతవార్త : మండలంలోని మన్నూరు ఎస్టీ కాలనీ యొక్క స్మశానాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన మన్నూరుకు చెందిన జడపల్లి రమణయ్య పై కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత 50 ఏళ్లగా గిరిజనులు వారి యొక్క పూర్వీకులు చనిపోతే ఆ స్మశానం లోనే పూడ్చి పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన జడపల్లి రమణయ్య స్మశానంలోని పెద్ద వృక్షాలను తొలగించి. స్మశానం చుట్టూ ఫెన్సింగ్ నాటుతుంటే ఇదేమిటి అని అడిగితే గిరిజనులపై దౌర్జన్యం చేస్తూ మీ దిక్కున్న చోటు చెప్పుకోండి నన్ను ఎవరు అడిగేది అని దౌర్జన్యం చేస్తున్నట్లు గిరిజనులు వాపోయారు. కులం పేరుతో దూషించినట్లు పేర్కొన్నారు. గిరిజనుల ద్వారా సమాచారం తెలుసుకున్న జిల్లా అధ్యక్షుడు, తలపల చెంచు మల్లికార్జునరావు స్మశానాన్ని పరిశీలించారు. బాలయపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రమణయ్యపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకురాలు వెలుగోటి రేవతి, తిరుపతి రాములమ్మ, కల్పన, చిరంజీవి, మన్నూరు ఎస్టి కాలనీ గిరిజనులు పాల్గొన్నారు.

## హామీల అమలుఘనత సిఎంకే దక్కుతుంది : ఎమ్మెల్యే



పెద్దపంజాణి మే18 ప్రభాతవార్త: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేస్తున్న ఘనత సిఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం మండలంలోని ముధరంపల్లి గ్రామంలో అర్హులైన పేదలు 47మందికి ఇంటిపట్టాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా సిఎం చంద్రబాబు నాయుడు నెరవేర్చుతున్నారని అన్నారు.త్వరలోనే రైతులకు అన్నదాత సుఖీభవ జూన్‌నెలలో చదువుకునే పిల్లలకు తల్లికి వందనం పథకాలు అమలు చేస్తామన్నారు.అలాగే ఆగష్టు 15నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీబస్సు ప్రయాణసౌకర్యం సైతం కల్పించి హామీలను అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా 2022లో ఒంగోలువద్ద జరిగిన మహానాడుకు కార్యక్రమం వెళ్ళి ప్రమాదానికి గురై మృతిచెందిన క్రిష్ణమూర్తి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధికింద 5లక్షల రూపాయల చెక్కును ఆయన బాధిత కుటుంబానికి అందించారు.ఈ కార్యక్రమంలో మాజీఎంపిపి విజయ్‌భాస్కర్‌రెడ్డి,ఎంపిపి రెడ్డెప్ప, నాయకులు ఆనంద్, చలపతి, మురహరిరెడ్డి, సుధాకర్‌రెడ్డి,రోజారెడ్డి, శ్రీరాములు, వేమారెడ్డి, నాగరాజురెడ్డి, జయరాంరెడ్డి, బెరబల్లి క్రిష్ణారెడ్డి తదితరలు పాల్గొన్నారు.

## తిరంగా ర్యాలీ.. దేశాభిమానుల హోళీ



పుంగనూరు, మే 18 ప్రభాతవార్త: విజయీ విశ్వతిరంగా ప్యారా.. జండా ఉంచా రహే హమారా అంటూ ప్రజలు పులకరించి పోయారు, దేశాభిమానులు కేరింతలు కొట్టారు. ఆపరేషన్ సింధూర్‌లో పాకిస్తాన్‌కు చెంపపెట్టు కొట్టిన భారత సేనల విజయాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని నగిరి ప్యాలెస్ ఆవరణం నుంచి గోకుల్ సర్కిల్ వరకు అన్ని రాజకీయ పక్షాలు,స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు. యువత ఆధ్వర్యంలో సింధూర్ ఆపరేషన్‌లో భాగంగా భారత సైనికులు పాకిస్తాన్లోని ఉగ్రసావరాలను ధ్వంసం చేస్తే సింధూర ఆపరేషన్ విజయవంతం చేసిన సందర్భంగా సైనికులకు సంఘీభావంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. 500 అడుగుల జాతీయ జెండాతో భారత్ మాతాకీ జై, పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలనుంచి స్వచ్ఛందంగా తరలివంచిన వేలాది మంది అభిమానులు చేత త్రివర్ణ పథకాలు పట్టుకుని వందేమాతరం అంటూ నినదించారు. బిజెపి పట్టణ అధ్యక్షుడు జగదీష్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో కూటమి పార్టీల నాయకులు పట్టణ స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు దేశాభిమానులు పాల్గొన్నారు.

## జన విజ్ఞాన వేదికచే దివ్యాంగులకు కూరగాయలు పంపిణీ



గూడూరు, మే 18 ప్రభాతవార్త : గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల భవనం నందు వాకాటి రామమోహన్ దాతృత్వం లో దివ్యాంగులకు కూరగాయలు గుడ్లు పంపిణీ జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ సమాజంలో ఉన్నటువంటి రుగ్మతలను తొలగిస్తూ మంచి సమాజం కొరకు పాటుపడుతూ చెడు అలవాటులకు దూరంగా ఉండమని ప్రచారం చేస్తూ వాటితో పాటు సేవా కార్యక్రమాలు కూడా చేయడం జరుగుతుందని వాటిలో భాగంగానే ప్రతినెల తొమ్మిదవ తేదీన ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు గర్భిణీ స్త్రీలకు భోజనాలు, ప్రతినెల మూడవ ఆదివారం దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేయడం మా జే.వి.వి.కి ఎంతో ఆత్మ సంతృప్తినిచ్చిందని ఇదేవిధంగా మంచి సేవా కార్యక్రమాలతో ముందుకు పోతూ మంచి సమాజం కొరకు పాటు పడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు,రామమోహన్, పురుషోత్తమరావు, అరుణ్ కుమార్, టీచర్ రాదయ్య, శర్మ, అశోక్, సుమన్‌రెడ్డి, నక్కాగోపి, సారంగంబాలులు పాల్గొన్నారు.

## వాయులింగేశ్వరుని దర్శించుకున్న కేంద్రమంత్రి



శ్రీకాళహస్తి,మే 18 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన వాయులింగేశ్వరస్వామిని కేంద్ర కన్స్యూమర్ ఎఫైర్ అండ్ ఫుడ్ అండ్ పబ్లికన డిస్ట్రిబ్యూషన్ కేంద్ర మంత్రి ప్రహ్లద్ జోషి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ మేరకు దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. కాగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ సారధ్యంలో పార్టీ క్యాడర్ స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద ఎఇఒ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ సారధ్యంలో స్వాగతం పలికారు.

## అమ్మవారి విగ్రహం విక్రయం

### పొంతనలేని సమాధానంతో నిందితుడు అరెస్టు

తిరుపతి కార్పొరేషన్, మే 18 ప్రభాతవార్త: అమ్మవారి విగ్రహాన్ని చోరీచేసి ఆపై విక్రయించడానికి ప్రయత్నించిన నిందితుడ్ని తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విగ్రహానికి సంబంధించి వివరాలు అతను పోలీసులకు చెప్పకపోవడంతో ఆదివారం సాయంత్రం అరెస్టుచేశారు. ఈస్టు సిఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.....పలమనేరుకు చెందిన గురుస్వామి, రాయల్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్ ఇద్దరూ ఆదివారం పలమనేరు నుండి అమ్మవారి విగ్రహంతో తిరుపతికి చేరారు.తిరుపతిలో అమ్మవారి విగ్రహాన్ని విక్రయిస్తుండగా అలిపిరి పోలీసులకు సమాచారం అందింది. అప్పటికే అమ్మవారి విగ్రహం చోరీపై పలమనేరు పోలీసులు ఈస్టుపోలీసులకు సమాచారంఅందించారు.దీంతో అలిపిరి సిఐ రామకిశోర్ విగ్రహం విక్రయించేందుకు చూస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అయితే విగ్రహం ఎక్కడ నుండి తీసుకువచ్చారు అనే కోణంలో విచారణ చేశారు. తమ పొలంలో మూడు విగ్రహాలు దొరికాయని, అందులో ఒకటి విక్రయించేందుకు తీసుకువచ్చామని అనే చెప్పడం, తగిన వివరాలు చెప్పలేకపోయాడని ఈస్టు పోలీసులు తెలిపారు. ఈస్టు పోలీసులు వారిని అరెస్టుచేసి విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## క్రీడల్లో విద్యార్థులు రాణించాలి : ఎమ్మెల్యే



గూడూరు, మే 18 ప్రభాతవార్త: క్రీడల్లో గూడూరు విద్యార్థినీ విద్యార్థులు రాణించడం శుభ పరిణామమని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పర్సన్ సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణ సమీపంలోని పోటుపాలెం వద్ద అర్జున అకాడమీని ఎమ్మెల్యే ప్రారంభించి, నిర్వాహకులను అభినందించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలకు పుట్టినిల్లు గూడూరు అని అనేక మంది పలు క్రీడల్లో రాణిస్తూ ఉన్నారని తెలిపారు. అర్జున అకాడమీ ద్వారా రాబోయే రోజుల్లో ఎంతోమంది క్రీడల్లో రాణించాలని వారికి మా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శివశంకర్, జయశంకర్, రూరల్ సిఐ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి.భువనేశ్వరరావుకు డాక్టరేట్





తిరుపతి విద్య, మే 18 ప్రభాతవార్త : మంచి ఆరోగ్యానికి మూలం ప్రకృతి–ఆ ప్రకృతిలోని ఔషధ సంపదను శాస్త్రీయంగా వెలికి తీసి, విశ్వసనీయంగా రుజువు చేసి ఆరోగ్య ప్రపంచానికి ఒక మధురమైన బహుమతి అందజేసిన డాక్టర్ సి. భువనేశ్వర్‌రావుకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ, సాంకేతిక విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 14వ స్నాతకోత్సవంలో పెద్దల చేత డాక్టరేట్ అవార్డును డాక్టర్ భువనేశ్వరరావు అందుకున్నారు. డాక్టర్ భువనేశ్వరరావు రేణిగుంట కృష్ణతేజ ఫార్మసీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గైడ్స్ జ్యోతి బాషిణి, కె.బి చంద్రశేఖర్ పర్యవేక్షణలో సాంకేతికత, పట్టుదల. శ్రద్ధ అనే మూడు శ్రేష్ట గుణాల సమ్మేళనం, ఈ శ్రమకు ప్రతిఫలంగా డాక్టర్ సి. భువనేశ్వరరావుకు డాక్టరేట్ రావడం శాస్త్రీయ దారిలో ఒక గొప్పమైలు రాయి. నా విజయం విద్యార్థులకు, పరిశోధనలకు పునాది కావాలని భువనేశ్వరరావు పిలుపునిచ్చారు.

## కన్నుల పండువగా స్వర్ణరథోత్సవం



చంద్రగిరి, మే 18 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణవెంకటేశ్వర స్వామివారి వార్షిక వసంతోత్సవాలలో స్వామివారు స్వర్ణరథంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు ఆదివారం స్వామి వారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. తదుపరి స్వామివారిని వసంత మంపడపానికి వేంచేపుచేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, పసుపు, చందనం, తేనె, కొబ్బరినీళ్ళతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారు వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకృతులై స్వర్ణరథంపై అధిష్టించి తిరుమాడ వీధులల విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఈ.ఈ.జగన్మోహన్‌రెడ్డి, డిప్యూటీ ఈఓ దామోదరం, ఏఈఓ యం.గోపినాథ్, సూపరింటెండెంట్ వి.రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ డి.మునికుమార్, ఆనంబట్టు ధనశేఖర్, ఇంజినీరింగ్ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## విద్యానగర్‌లో బైక్ చోరీ!

కోట, మే 18 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎల్రక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఉద్యోగి రవీంద్ర కొత్తపాళెం రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్నారు. హీరో ఫ్లైన్ బైక్ చోరీకి గురయింది. రవీంద్ర మధ్యాహ్నం తన ఇంటి బయట బైక్ ఉంచి భోజనం చేసి వచ్చేలోగా బైక్ అపహరణకు గురైయింది. ఆ మేరకు బాధితుడు రవీంద్ర కోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఇటీవల కాలంలో బైక్ దొంగతనాలు ఎక్కువ కావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు నిఘా పెంచాలని బాధితులు కోరుతున్నారు.కోట మండలంలో మోటారు సైకిళ్ల చోరీ ముఠా సంచారిస్తుదని అనుమానాలు ఎక్కువగా ఉన్నాయి. ఒకే వారంలో రెండు మోటారుసైకిళ్ల దొంగతనాలకు గురికావడంతో మోటారు సైకిళ్ల వాహన దారులు భయపడుతున్నారు. ఈ దొంగల ముఠా పై పోలీసులు నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

## శవం ఆచూకీ కోసం పోలీసులు ఆరా

కోట,మే 18 ప్రభాతవార్త: మండలం కేశవరం గ్రామ పంచాయతీలోని కొండుగుంట గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు పక్క పడి మృతి చెందారు. ఆమేరకు విఆర్ఓ పోలయ్య పోలీసులకు పిర్యాదు చేశారు. దీంతో ఎస్.ఐ.పవన్ కుమార్ శవం ఆచూకీ కోరకు ఆరా తీస్తున్నారు. ఇతను ఎక్కడ నుంచి వచ్చాడో ఎవరు, ఎందువలన చనిపోయడు వడ దెబ్బకు గురై మృతి చెందాడా?ఇంకా ఏమైనా జరిగిందా అనే కోణంలో విచారిస్తున్నారు.